


ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి పట్టభద్ర ఓటర్లు తమ మద్దతు తెలిపారు. ప్రభుత్వంపై విశ్వాసంతో స్థానిక ఎన్నికల్లో కూటమికి ఘన విజయాన్ని అందించారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ


బుధవారం 04.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 194 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



పట్టణాల్లో కూటమి ప్రభంజనం...

వైసీపీకి ఘోర పరాజయం !

కుప్పం నుంచి మాచర్ల వరకు విజయదుందుభి..

2,454 స్థానాలతో చరిత్రాత్మక ఆధిక్యం

13 కార్పొరేషన్లలోనూ కూటమి హవా..

టీడీపీ 1,986, జనసేన 349, బీజేపీ 119 స్థానాల్లో విజయం

ప్రధాన పట్టణాల్లో ఏకపక్ష ఫలితాలు..

కేవలం 359 స్థానాలకే పరిమితమైన వైసీపీ

పట్టణ ఓటర్లు తీర్పు చెప్పేశారు.. కూటమి జైత్రయాత్రకు జైకొట్టారు!

ఆంధ్రప్రదేశ్ పుర‌పాలక ఎన్నికల సమరంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తిరుగులేని విజయాన్ని నమోదు చేస్తూ రాజకీయ ప్రత్యర్థులకు బిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ప్రతి రౌండ్‌లోనూ ఆధిపత్యం ప్రదర్శించిన కూటమి.. ఫలితాల సరళిని తనకు అనుకూలంగా మలుచుకుంటూ విజయదుందుభి మోగించింది. కుప్పంలో టీడీపీ క్లీన్‌స్వీప్.. మాచర్లలో కూటమి సంపూర్ణ విజయం.. తెనాలి, పెనుకొండ, ఎమ్మిగనూరుల్లో భారీ ఆధిక్యాలు.. ఇలా పట్టణం ఏదైనా కూటమి జెండా రెపరెపలాడింది. 2,454 స్థానాలను కైవసం చేసుకుని ప్రత్యర్థి వైసీపీని దాదాపు దరిదాపుల్లోకి రానివ్వకుండా కూటమి తన రాజకీయ బలాన్ని చాటుకుంది. ఈ ఫలితాలు కేవలం ఎన్నికల విజయాలే కాదు.. పట్టణ ప్రాంతాల్లో కూటమికి లభించిన ప్రజా మద్దతుకు తిరుగులేని నిదర్శనంగా నిలిచాయి.

మిగతా 2లో...

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ఓటర్లు కూటమికి పట్టం కడుతూ ఘన విజయాన్ని అందించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచే ఆధిక్యం ప్రదర్శించిన కూటమి అభ్యర్థులు.. తుది ఫలితాలు వెలువడే కొద్దీ విజయపరంపరను కొనసాగించారు. కుప్పం నుంచి మాచర్ల వరకు, ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. అనేక మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఏకపక్ష విజయాలు నమోదు చేశారు.

కార్పొరేషన్లు 13

తెదేపా	9
జనసేన	2
భాజపా	1
వైకాపా	1

మున్సిపాలిటీలు 86/87

తెదేపా	59
జనసేన	17
భాజపా	4
వైకాపా	3
ఇండి	3

అప్రమత్తంగా ఉండండి



మురసు తుపాను నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఆదేశాలు

దాదాపు 15 జిల్లాల్లో భారీ వర్షాలు

చెరువులు, కాలువల గట్లకు రక్షణ కల్పించాలి

ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

సాధారణ పరిస్థితులు నెలకొనేవరకు క్షేత్రస్థాయిలోనే సిబ్బంది

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుపాను తీరాన్ని దాటే ప్రక్రియ మరికొన్ని గంటలపాటు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. మిగతా 2లో...

గెలుపు బాధ్యతను పెంచింది

- **మున్సిపల్ ఎన్నికల తీర్పు ప్రజల ఆశీర్వాదం**
- **ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యం**
- **విజేతలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి**
- **ప్రజాసేవ, రాష్ట్ర ప్రగతికే తొలి ప్రాధాన్యం: లోకేష్**

2 లో



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును కేవలం గెలుపుగా కాకుండా తమపై ఉంచిన మరింత పెద్ద బాధ్యతగా భావిస్తున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రెండున్నరేళ్లుగా ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంగా ఈ తీర్పును స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులందరికీ నారా లోకేష్ అభినందనలు తెలిపారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా చేసిన కృషికి ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసినందున ఇక ప్రజాసేవపైనే మిగతా 2లో...

తుపాన్ల నష్టంపై ఆరా



- **చంద్రబాబుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్**
- **అర్ణబ్, మురసు ప్రభావం.. పంట, ఆస్తి నష్టాలపై చర్చ**
- **రాష్ట్రంపై పెరిగిన ఆర్థిక భారాన్ని వివరించిన సీఎం**

2 లో

వరద ముప్పుపై నిఘా




- **ఏడు జిల్లాల అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశాలు**
- **డ్రైన్లు, కాలువల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి**
- **నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలి**

2 లో

తుఫాను సాయంపై కేంద్రానికి విజ్ఞప్తి

- **వరుస తుఫాన్లతో రాష్ట్రానికి భారీగా నష్టం**
- **కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ**
- **హోం మంత్రి తో ఒకే రోజు రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడిన సీఎం**
- **తుఫాన్ల ప్రభావం, పంట, ఆస్తి నష్టం, సహాయక చర్యల గురించి వెల్లడి**



అమరావతి, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్) : అర్ణబ్, మురసు తుఫాన్ల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. తుఫాను కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సంభవించిన పంట, ఆస్తి నష్టంతో పాటు ప్రజలకు కలిగిన ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను వివరిస్తూ కేంద్ర మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి లేఖ రాశారు. మిగతా 2లో...

పంటల బీమాపై రైతన్నలకు అవగాహన

- **ఇన్‌పుట్ సబ్సిడీ - బీమాతో పెట్టుబడికి రక్షణ**
- **అన్నదాతలు ముందుకొచ్చేలా వ్యవసాయ శాఖ చొరవ చూపాలి**

2 లో

తుఫాన్ల సహాయక చర్యల్లో టీమ్ స్పిరిట్‌తో పనిచేశాం

- **దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను 4-5 రోజుల్లోనే గాడిన పెట్టాం**
- **తుఫాన్లు...కరవుపై ఒకేసారి కేంద్ర బృందాలు ఏపీలో పర్యటిస్తున్నాయి**

5 లో

రాష్ట్రాన్ని ముంచెత్తిన 'మురసు' తుపాను



- **ఒంగోలు సమీపంలో తీరం దాటిన తీవ్ర తుపాను.. పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు**
- **52 వేల హెక్టార్లకు పైగా పంట నష్టం అంచనా.. చీరాలలో 230 మి.మీ. వర్షపాతం**
- **ఆరు పట్టణ స్థానిక సంస్థల్లో 922 మందికి పునరావాసం.. నేలకూలిన 91 చెట్లు**

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'మురసు' ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. నెల్లూరు-నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో మంగళవారం తెల్లవారు జామున 3.30 నుంచి 5.30 గంటల మధ్య తుపాను తీరం దాటింది. దీని ప్రభావంతో ప్రకాశం, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు తదితర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా చీరాల, నరసరావుపేట, విజయవాడ ప్రాంతాల్లో కుండపోత వర్షం జనజీవనాన్ని స్తంభింపజేసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు చెరువులను తలపించగా, పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. మరోవైపు వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 52 వేల హెక్టార్లకు పైగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. వర్షాల తీవ్రత దృష్ట్యా ఆరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 922 మందిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. మిగతా 5లో...

రోడ్లకు రక్షణ కవచం



- **మురసు నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలు**
- **వరద ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**
- **కూలిన చెట్ల తొలగింపునకు ప్రత్యేక బృందాలు**
- **వంతెనలు, కల్వర్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ**
- **మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడి**

2 లో

అమరావతి, నవంబర్ 3 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుఫాన్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల భద్రత, రాకపోకల పునరుద్ధరణకు ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఆ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర రహదారులు, ప్రధాన జిల్లా రహదారులు, జాతీయ రహదారుల పరిధిలో 30 కంట్రోల్ రూమ్‌లు, సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

హేమంత్ కుడికాలు తొలగింపు



2 లో

వైఎస్సార్ కంచుకోటలో కూటమి ప్రభంజనం

పులివెందులలో 13,875 ఓట్ల భారీ మెజార్టీతో టీడీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి గీతాకుమారి విజయం

జమ్మలమడుగు, మైదుకూరులో క్లీన్‌స్వీప్.. రాజంపేటలో పసుపు జెండా రెపరెపలు

కడప కార్పొరేషన్‌లో 60,863 ఓట్ల రికార్డు మెజార్టీతో టీడీపీ అభ్యర్థి సువర్ణ మాటిల్ గెలుపు

3 లో



అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల రక్షణ, మౌలిక వసతుల పునరుద్ధరణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటికే తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయని, గుంటూరు వంటి ప్రాంతాల్లో గంటల వ్యవధిలో 30 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదవడం తుపాను తీవ్రతను తెలియజేస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది సేవలు అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భారీ వర్షాలతో గ్రామీణ ప్రాంతాలకు ముంపు ముప్పు పొంచి ఉందని అప్రమత్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టలు, కాలువ గట్లను గుర్తించి, వాటిని తక్షణం పటిష్టపరిచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువులకు సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.

మురసు తుపాను నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సహాయక చర్యలపై సమీక్షించారు. వర్షాలు తగ్గే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనంతరం చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో అర్నబ్ తుపాను సమయంలో అనుసరించిన విధంగానే – ఇతర జిల్లాల నుంచి సిబ్బందిని తరలించి, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర పనులకు వినియోగించాలని నిర్దేశించారు. గ్రామాల్లో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునే వరకు సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

ఎడతెరిపి లేని వర్షాల కారణంగా అనేక గ్రామాలకు ముంపు ముప్పు పొంచి ఉందని, పెద్ద ఎత్తున వర్షపు నీటి నిల్వలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. నివాస ప్రాంతాలకు సమీపంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా మళ్లింపు చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థకు అడ్డంకులు ఏర్పడకుండా చూడాలని స్పష్టం చేశారు. నీటిని తొలగించిన ప్రాంతాల్లో దుర్వాసన, దోమల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యతను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా పైప్‌లైన్లు దెబ్బతింటే తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో బ్లీచింగ్, క్లోరినేషన్, అవసరమైన చోట సూపర్ క్లోరినేషన్ చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

వర్షపు నీటి ప్రవాహాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను తక్షణం పునరుద్ధరించి, గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. వ్యవసాయ, విద్యుత్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పంట నష్టం, ఆస్తి నష్టం సంభవించిన ప్రాంతాల్లో తక్షణమే అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు అందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

అవసరమైతే కమిషనరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మురసు తుపాను సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

గెలుపు బాధ్యతను పెంచింది

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి పెట్టాలని సూచించారు.

విజయం సాధించిన ప్రతి ప్రజాప్రతినిధి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సేవలందించాలని సూచించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన బాధ్యత అని పేర్కొన్నారు.

ఎన్నికల తీర్పు మరింత వినయంతో, బాధ్యతతో పనిచేయాలనే సంకల్పాన్ని ఇచ్చిందని నారా లోకేష్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత అంకితభావంతో పనిచేస్తామని, ప్రజాసేవ, రాష్ట్ర ప్రగతికి ప్రజా ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు.

తుఫాన్ల నష్టంపై ఆరా

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో వరుస తుఫాన్ల ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులు, జరిగిన నష్టం, ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అర్నబ్ తుఫాను ప్రభావం నుంచి రాష్ట్రం కోలుకోకముందే మురసు తుఫాను రావడంతో ఎదురైన ఇబ్బందులను సీఎం చంద్రబాబు వివరించారు. వివిధ జిల్లాల్లో పంటలు, ఆస్తులకు జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా వెల్లడించారు.

తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పంపినందుకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. వరుస తుఫాన్ల కారణంగా రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

రోడ్లకు రక్షణ కవచం

(మొదటి పేజీ తరువాయి)

సహాయక చర్యల పర్యవేక్షణకు 40 మంది సమన్వయ అధికారులను నియమించామని, వివిధ శాఖల సమన్వయంతో ఎనిమిది సమావేశాలు నిర్వహించి చర్యలను పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. తుఫాన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న 178 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 471 జేసీబీలు, 421 విద్యుత్ రంపపు యంత్రాలతో అత్యవసర సహాయక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. 53 ప్రాంతాల్లో సిబ్బంది, యంత్రాలు, అవసరమైన సామగ్రితో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తున్నాయని చెప్పారు. రహదారులు, వంతెనలు, కల్వర్టుల వద్ద నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే రహదారుల వద్ద ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. రహదారులపై కూలిన చెట్లను వెంటనే తొలగిస్తూ రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. వరదల కారణంగా రహదారులకు గండ్లు ఏర్పడిన ప్రాంతాల్లో తక్షణ పునరుద్ధరణకు సిబ్బంది, యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచామని చెప్పారు. అవసరమైన చోట్ల గండ్ల పూడ్చివేతకు ఇసుక బస్తాలు, నిర్మాణ సామగ్రిని అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

గతంలో రహదారులకు గండ్లు ఏర్పడిన ప్రాంతాల్లో ప్రత్యేక విపత్తు స్పందన బృందాలను అప్రమత్తంగా ఉంచామని, ప్రమాదకరమైన ఎండిన, చనిపోయిన చెట్లను గుర్తించి తొలగించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సెలవులను రద్దు చేసినట్లు చెప్పారు.

తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు సహాయక చర్యలు, రహదారుల పునరుద్ధరణ పనులు నిరంతరాయంగా కొనసాగుతాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు రహదారి రవాణాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్ అండ్ బీ శాఖ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.

పట్టణాల్లో కూటమి ప్రభంజనం.. వైసీపీకి ఘోర పరాజయం!

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో పోటీ ఇవ్వలేక చతికిలపడింది. ఈ ఫలితాలు రాష్ట్ర పట్టణ రాజకీయాల్లో కూటమి బలాన్ని మరోసారి చాటిచెప్పాయి.

2,454 స్థానాలతో కూటమి తిరుగులేని ఆధిక్యం : పురపాలక ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ అగ్రస్థానంలో నిలిచింది. మంగళవారం రాత్రి వరకు ప్రకటించిన 2,866 వార్డులు, డివిజన్ల ఫలితాల్లో కూటమి పార్టీలు కలిపి 2,454 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ ఏకంగా 1,986 స్థానాలను గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. జనసేన పార్టీ 349, భారతీయ జనతా పార్టీ 119 స్థానాల్లో విజయం సాధించాయి. మూడు పార్టీల మధ్య ఎన్నికల సమన్వయం, పరస్పర సహకారం ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది.

ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ 359 స్థానాలకే పరిమితమైంది. స్వతంత్ర అభ్యర్థులు 43 స్థానాల్లో, సీపీఐ ఆరు, సీపీఎం నాలుగు స్థానాల్లో విజయం సాధించాయి. ప్రకటిత ఫలితాలను పరిశీలిస్తే కూటమి సాధించిన స్థానాలు వైసీపీ విజయాల కంటే దాదాపు ఏడు రెట్లు అధికంగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో కూటమికి లభించిన ప్రజా మద్దతుకు ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు వ్యక్తం చేసిన ధీమా ఫలితాల్లోనూ ప్రతిబింబించింది.

13 కార్పొరేషన్లలోనూ కూటమి హవా : రాష్ట్రంలోని ప్రధాన నగరపాలక సంస్థల ఎన్నికలు ఈ ఫలితాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం నగరపాలక సంస్థల్లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 13 మేయర్ స్థానాల్లో టీడీపీ 10, జనసేన రెండు, బీజేపీ ఒక స్థానంలో పోటీ చేయగా, వైసీపీ అన్ని కార్పొరేషన్లలోనూ అభ్యర్థులను బరిలో నిలిపింది.

మంగళవారం ఉదయం ప్రారంభమైన కౌంటింగ్‌లో తొలి రౌండ్ నుంచే కూటమి అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించారు. మధ్యాహ్నానికి వెలువడిన ట్రెండ్స్‌లోనే 13 కార్పొరేషన్లకు గాను 12 చోట్ల కూటమి అభ్యర్థులు ముందంజలో కొనసాగారు. అనంతపురంలో మాత్రం వైసీపీ అభ్యర్థి రమేష్ గౌడ్ ఆధిక్యంలో నిలిచారు. ప్రధాన నగరాల్లో కూటమి అభ్యర్థులు ప్రదర్శించిన ఆధిక్యం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నుంచి సాధారణ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు వరకు అనేక ప్రాంతాల్లో కూటమి అభ్యర్థులే ముందంజలో నిలవడం విశేషం.

కుప్పంలో టీడీపీ క్లీన్‌స్వీప్.. వైసీపీకి ఖాతా తెరిచే అవకాశం లేదు : మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఫలితాల్లో కుప్పం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులనూ తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. ఒక్క వార్డులో కూడా వైసీపీ విజయం సాధించలేకపోయింది. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో టీడీపీ సాధించిన ఈ సంపూర్ణ విజయం కూటమి శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. కుప్పంలో అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలు, స్థానిక నాయకత్వంపై ప్రజలు విశ్వాసం వ్యక్తం చేశారనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వినిపించాయి.



మాచర్లలో 36కు 36.. కూటమి సమష్టి సత్తా : పల్నాడు జిల్లాలోని మాచర్ల మున్సిపాలిటీలోనూ కూటమి అభ్యర్థులు అద్భుతమైన ఫలితాన్ని నమోదు చేశారు. మొత్తం 36 వార్డులనూ మూడు కూటమి పార్టీలు కలిసి గెలుచుకోవడం విశేషం. టీడీపీ 32, జనసేన మూడు, బీజేపీ ఒక వార్డును దక్కించుకున్నాయి. వైసీపీకి ఒక్క స్థానం కూడా దక్కలేదు. ఎన్నికల సమయంలో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న మాచర్లలో కూటమి సాధించిన ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్చకు దారితీసింది. మూడు పార్టీల మధ్య సమన్వయం, స్థానిక స్థాయిలో నిర్వహించిన ప్రచారం ఫలితాల్లో ప్రతిబింబించాయి.

పెనుకొండ, ఎమ్మిగనూరు, తెనాలిలో భారీ ఆధిక్యం : ఇతర మున్సిపాలిటీల్లోనూ కూటమి అభ్యర్థులు భారీ విజయాలు సాధించారు. పెనుకొండలో మొత్తం 23 వార్డులకు గాను కూటమి 21 స్థానాలను గెలుచుకుంది. ఎమ్మిగనూరులో 44 వార్డుల్లో 38 స్థానాలను కైవసం చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురంలో 36 వార్డులకు గాను 31 స్థానాలు కూటమి ఖాతాలో చేరాయి. పలాస–కాశీబుగ్గలో 36 వార్డుల్లో 31 స్థానాలను గెలుచుకుంది. తెనాలి మున్సిపాలిటీలో మొత్తం 52 వార్డులకు గాను 46 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు.

ఈ ఫలితాలు కూటమికి పట్టణ ప్రాంతాల్లో ఉన్న విస్తృతమైన రాజకీయ పునాదిని తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం వంటి అంశాలపై ఓటర్లు తమ తీర్పును ఇచ్చినట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అనేక చోట్ల వైసీపీ అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వలేకపోవడం ఆ పార్టీకి ఎదురుదెబ్బగా మారింది.

ఏకగ్రీవాల్లోనూ కూటమిదే పైచేయి : ఎన్నికల ప్రక్రియలో ఏకగ్రీవ ఫలితాలు కూడా కూటమికి అనుకూలంగా నిలిచాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్ల పరిధిలో 118 డివిజన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో 637 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవుల్లో 17 స్థానాలు ఏకగ్రీవం కాగా, వాటిలో టీడీపీ 15 స్థానాలు, జనసేన ఒకటి, బీజేపీ ఒకటి దక్కించుకున్నాయి. దీంతో ఎన్నికల లెక్కింపునకు ముందే పలు పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి తన బలాన్ని చాటుకుంది.

96 లక్షలకుపైగా ఓటర్లు.. 60 లక్షల మందికి పైగా ఓటింగ్ : రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ ఎన్నికలు నిర్వహించారు. వీటిలో 13 నగరపాలక సంస్థలు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. కార్పొరేషన్ల పరిధిలో 804 డివిజన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో 2,382 వార్డులకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 96,89,061 మంది ఓటర్లకు గాను 60,22,411 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నవంబరు 1న పోలింగ్ నిర్వహించగా, మంగళవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచే రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు భారీగా చేరుకున్నారు. తొలి రౌండ్ ఫలితాల నుంచే కూటమి ఆధిక్యం స్పష్టమవడంతో కూటమి శ్రేణుల్లో సంబరాలు మొదలయ్యాయి.

అక్కడక్కడా వైసీపీ విజయాలు.. నందికొట్కూరులో ఆధిక్యం : రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనం కొనసాగినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులు విజయాలు నమోదు చేశారు. నందికొట్కూరు మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులకు గాను వైసీపీ 22 స్థానాలను గెలుచుకుని స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. బేతంచర్లలోనూ ఆ పార్టీ అభ్యర్థులు ఆధిక్యంలో నిలిచారు. కళ్యాణదుర్గంలో రెండు వార్డులను గెలుచుకుంది. ధర్మవరం మున్సిపాలిటీలో ఒకటో వార్డులో వైసీపీ అభ్యర్థి కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించడం ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర పరిణామంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా పరాజయం ఎదురైనా కొన్ని ప్రాంతాల్లో వైసీపీ తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసింది. అయితే ఈ పరిమిత విజయాలు కూటమి సాధించిన భారీ ఆధిక్యాన్ని తగ్గించలేకపోయాయి.

తుఫాను ప్రభావంతో కొన్ని చోట్ల కౌంటింగ్ ఆలస్యం : మరోవైపు మురసు తుపాను ప్రభావం ఎన్నికల ఓట్ల లెక్కింపుపైనా పడింది. ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా కొన్ని కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కింపు ప్రక్రియ ఆలస్యమైంది. విజయవాడలోనూ నిర్ణీత సమయానికి కౌంటింగ్ ప్రారంభం కాలేదు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. చీరాల మున్సిపాలిటీలో ఓట్ల లెక్కింపును నవంబరు 6కు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో ఫలితాల ప్రకటన ఆలస్యమైంది.

కూటమి ప్రభుత్వానికి పట్టణ ఓటర్ల మద్దతు : ఈ ఎన్నికల ఫలితాలను రాజకీయంగా పరిశీలిస్తే కూటమి ప్రభుత్వానికి పట్టణ ప్రాంతాల్లో లభిస్తున్న మద్దతు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో మూడు పార్టీల నేతలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. మరోవైపు మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, స్థానిక నాయకుల సమన్వయం, కార్యకర్తల సమష్టి కృషి కూటమి విజయానికి బలంగా నిలిచాయి. గత ఎన్నికల్లో ఎదురైన పరాజయాల నుంచి కోలుకోవాలని ప్రయత్నిస్తున్న వైసీపీకి తాజా ఫలితాలు మరో రాజకీయ సవాలుగా మారాయి. పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని తిరిగి పెంచుకోవాల్సిన అవసరాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా కుప్పం, మాచర్ల వంటి కీలక ప్రాంతాల్లో కూటమి సాధించిన సంపూర్ణ విజయాలు, తెనాలి, ఎమ్మిగనూరు, పెనుకొండ వంటి పట్టణాల్లో భారీ ఆధిక్యాలు కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

మొత్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి భారీ విజయాన్ని అందించడమే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశాన్ని కల్పించాయి. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజల మద్దతు పొందుతున్నామని కూటమి నేతలు చెప్పుకునేందుకు ఈ ఫలితాలు బలమైన ఆధారంగా నిలిచాయి. రానున్న రోజుల్లో పట్టణాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఏ మేరకు పనితీరు కనబరుస్తారన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

తుఫాను సాయంపై కేంద్రానికి విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని తక్షణమే అందించాలని విజ్ఞప్తి చేశారు. మురసు తుఫాను ప్రభావం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర మంత్రి ఫోన్ చేశారు. రాష్ట్రంలో తుఫాను పరిస్థితులు, జరిగిన నష్టం, సహాయక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. ఒకే రోజు రెండుసార్లు అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ముఖ్యమంత్రి, వరుస తుఫాన్ల కారణంగా రాష్ట్రానికి ఎదురైన నష్టాన్ని వివరించారు. అర్నబ్ తుఫాను ప్రభావం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోకముందే మురసు తుఫాను కారణంగా పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయని సీఎం వివరించారు.

రూ.343.95 కోట్ల మేర ప్రాథమిక నష్టం : మురసు తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని ఎనిమిది శాఖలకు సంబంధించి ప్రాథమికంగా సుమారు రూ. 343.95 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ముఖ్యమంత్రి కేంద్ర హోంమంత్రికి వివరించారు. ఇందులో దాదాపు 94 శాతం నష్టం వ్యవసాయ రంగంలోనే ఉందని తెలిపారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 465 గ్రామాల పరిధిలో 50,473 హెక్టార్లలో పంటలు దెబ్బ తిన్నాయని, 69,828 మంది రైతులు ప్రభావితమయ్యారని వివరించారు. వీటిలో 45,900 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని, వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రాథమికంగా రూ. 324.22 కోట్ల నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పంట నష్టం అధికంగా ఉందని, ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయని వివరించారు. తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, అత్యవసర కార్యకలాపాల కేంద్రాలను అప్రమత్తం చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరావాస చర్యల కోసం 11 ఎన్‌డీఆర్ఎఫ్, 13 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే సిద్ధం చేశామని తెలిపారు. ప్రభావిత జిల్లాల్లో 480 పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12,230 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వివరించారు.

తుఫాను నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందాన్ని పంపినందుకు అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న అనంతరం పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్, సాగునీటి వనరులకు జరిగిన నష్టంపై సమగ్రంగా అంచనాలు రూపొందించి పూర్తి స్థాయి నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని వెల్లడించారు. వరుస తుఫాన్ల కారణంగా రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు కేంద్రం అవసరమైన సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో తుఫాను ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో నష్టాలపై సమగ్ర అంచనాలు రూపొందించే ప్రక్రియను పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన వెంటనే చేపడతామని సీఎం తన లేఖలో పేర్కొన్నారు.

పంటల బీమాపై రైతన్నలకు అవగాహన

- **ఇన్‌పుట్ సబ్సిడీ - బీమాతో పెట్టుబడికి రక్షణ**
- **అన్నదాతలు ముందుకొచ్చేలా వ్యవసాయ శాఖ చొరవ చూపాలి**
- **అధికారులతో టెలికాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి, నవంబర్ 3 (జర్నలిస్ట్ ఫైల్) : భవిష్యత్ లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏ ఒక్క రైతు, కౌలుదారు నష్టపోకుండా బీమా రక్షణ కవచంలా నిలిచేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. పంటల బీమాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలన్నారు. పంటల బీమాపై వ్యవసాయ శాఖ అధికారులతో సచివాలయం నుంచి మంగళవారం ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'ఈ సీజన్‌లో అర్నబ్, మురసు తుఫాన్లు వెంటవెంటనే ప్రభావం చూపినప్పటికీ ఎదుర్కొనేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టాం. అయితే వ్యవసాయరంగానికి ఈ తుఫాన్ల వల్ల ఎక్కువ నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 22 రకాల పంటలను బీమాకు నోటిఫై చేశాం. ఇందులో 15 పంటలకు దిగుబడి ఆధారిత బీమా, మరో 7 పంటలకు వాతావరణ ఆధారిత బీమా అమలు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల ఫలితంగా పంటల బీమాలో రైతుల నమోదు గణనీయంగా పెరిగింది. పంటల బీమా కల్పించడంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉంది. ఈసారి 17.07 లక్షల మంది రైతులు సాగు చేసిన పంటలకు బీమా కల్పించాం. బీమా చేయించిన మొత్తం విస్తీర్ణంలో వరి, కందులు, వేరుశనగ, పత్తి, మిరప, మొక్కజొన్న పంటల వాటా 90 శాతంగా ఉంది. వరి పంట సాగు విస్తీర్ణంలో అధిక భాగం తుపాను ప్రభావిత 16 జిల్లాల్లోనే ఉంది. క్లస్టర్ల వారీగా వివిధ బీమా కంపెనీలకు పంటల బీమా బాధ్యతలను అప్పగిస్తున్నాం. పంటల దిగుబడి ఆధారంగా బీమా పరిహారం నిర్ణయించే విధానాన్ని ఏర్పాటు చేస్తున్నాం. తుఫాన్ల సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నాం. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రెండూ అందితే రైతుకు పెట్టుబడి తిరిగి రావడంతో పాటు, ఆర్థిక భద్రత కలుగుతుంది. బీమా ప్రీమియం చెల్లించిన వారికి పరిహారం అందేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏ ఒక్కరికీ నష్టం జరగకూడదు. బీమా కంపెనీలు కూడా పారదర్శకంగా, నిజాయితీగా పనిచేయాలి.' అని సీఎం అన్నారు.

నెలాఖరు కల్లా సీసీఈల ఏర్పాటు : 'పంటల బీమా అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. మొత్తం 30,286 సీసీఈ లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటిని నవంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలి. రాష్ట్రంలో రెండేళ్లకోసారి, కొన్నిసార్లు ఐదేళ్లకోసారి తుఫాన్లు సంభవిస్తున్నాయి. వీటి కారణంగా రైతులు పెట్టిన పెట్టుబడిని కూడా తిరిగి పొందలేకపోతున్నారు. రైతులకు పెట్టుబడి తిరిగి వచ్చేలా భరోసా కల్పిస్తే నష్టాల నుంచి బయటపడగలుగుతారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాను సమన్వయం చేస్తే రైతులకు పూర్తిస్థాయిలో మేలు జరుగుతుంది. రైతుల్లో పంటల బీమాపై అవగాహన, ఆమోదం కల్పించగలిగితే వారు బీమా ప్రీమియం చెల్లించేందుకు ముందుకొస్తారు. తద్వారా వారికి ఆర్థిక భద్రత కలుగుతుంది. ఈ నెలలోనే అన్ని అవగాహన కార్యక్రమాలను పూర్తి చేయాలి. అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తున్న రూ.20,000 ఎంతలా ఉపయోగపడుతుందో... బీమా కూడా రైతును ఆదుకోవడంలో దోహద పడుతుంది.' అని ముఖ్యమంత్రి చెప్పారు.

అగ్రి యాప్‌తో విస్తృత ప్రయోజనాలు : 'రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులు ఉంటే.. 20 లక్షల మంది అగ్రి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 10 లక్షల మంది నిత్యం వినియోగిస్తున్నారు. యాప్ ద్వారా అన్నిరకాల సేవలు అందుతున్నాయి. దీనిని మరింత వినియోగించుకోవాలి. యాప్ ఆధారంగానే పంటల రుణాలు అందించే విధానం ఉండాలి. పంట నష్టానికి సంబంధించిన వివరాలన్నింటినీ అగ్రి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వ్యవసాయ అధికారులపై గురుతర బాధ్యత ఉంది. ఎన్నికలు ఉన్నప్పటికీ రైతులకు సంబంధించిన ఈ పనులపైనే దృష్టి సారిస్తున్నాం. నమ్ముకున్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు అద్భుతంగా పనిచేస్తున్నారు...వారిని అభినందిస్తున్నాను.

హేమంత్ కుడికాలు తొలగింపు

అనంతపురం(జర్నలిస్ట్ ఫైల్) : రాప్తాడు ఘటనలో నిందితుడు హేమంత్ కుడికాలును వైద్యులు తొలగించారు. మోకాలి పైభాగం వరకు కాలును తొలగించినట్లు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి తెలిపారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించినట్లు చెప్పారు.

పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన హేమంత్ కుడికాలుకు రక్తప్రసరణ పూర్తిగా నిలిచిపోవడంతో కణజాలం దెబ్బతిని కాలు కుళ్లిపోయినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమించకుండా ఉండేందుకు మోకాలి పైభాగం వరకు కాలును తొలగించాల్సి వచ్చిందని తెలిపారు.

ఇదే సమయంలో ఎడమ కాలికి సంబంధించిన రక్తనాళాలు కూడా దెబ్బతినడంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి రక్తప్రసరణను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టారు. ఆపరేషన్ అనంతరం హేమంత్‌ను ఆపరేషన్ థియేటర్ నుంచి ఏఎంసీకి తరలించి చికిత్స కొనసాగిస్తున్నారు.

రాప్తాడు మండలంలో పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన అనంతరం హేమంత్ పరారయ్యాడు. అతడిని ఆత్మకూరు అడవిలో పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేయగా, సీఐ వెంకటేశ్‌పై దాడికి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో తొలుత గాల్లోకి కాల్పులు జరిపినా నిందితుడు వెనక్కి తగ్గకపోవడంతో అతడి కాళ్లపై కాల్పులు జరిపారు.

కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి వెల్లడించారు.

వరద ముప్పుపై నిఘా



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పరిశీలించాలని సూచించారు. రేపల్లె మెయిన్ డ్రైన్, భట్టిప్రోలు మెయిన్ డ్రైన్, గుంటూరు నల్ల డ్రైన్, కొలిమెర్ల, నల్లమడ, పర్చూరు వాగు, రొంపేరు కుడి, ఎడమ కాలువలు, బుడమేరు, లాజబండ, చంద్రయ్య డ్రైన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. డ్రైన్లు, కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, గుర్రపుడెక్క వంటి నీటి కలుపు మొక్కలను తొలగించాలని ఆదేశించారు.

పంటలు, ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి నిమ్మల తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుండ్లకమ్మ, బుడమేరు, రామవరం తదితర డ్రైన్లు, వాగులు ఫ్లాష్ వరదలతో పొంగే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



ఆలపాటి వ్యూహం... తెనాలిలో కూటమి ప్రభంజనం









తెనాలి మున్సిపాలిటీలో కూటమి ఘన విజయం

52 వార్డులకు 46 కూటమి ఖాతాలోనే..

టీడీపీ 29
జనసేన 16
బీజేపీ ఒకటి

చైర్‌పర్సన్‌గా తోటకూర వెంకట రమణారావు

17,093 ఓట్ల భారీ మెజారిటీ

తెనాలి, నవంబర్ 3 (జర్నలిస్ట్ ఫైల్): తెనాలి మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయాన్ని నమోదు చేసింది. పట్టణంలోని 52 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకంగా 46 స్థానాలను కైవసం చేసుకుని స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. ఈ విజయంతో తెనాలి మున్సిపాలిటీలో కూటమి తన బలాన్ని చాటుకుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అలపాటి రాజేంద్ర ప్రసాద్ సమన్వయం, వ్యూహరచన, క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా నిలిచాయి.

చైర్‌పర్సన్‌గా తోటకూర వెంకట రమణారావు : తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో కూటమి అభ్యర్థి తోటకూర వెంకట రమణారావు ఘన విజయం సాధించారు. ఆయనకు 51,020 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మద్దాలి శేషాచలానికి 33,927 ఓట్లు వచ్చాయి. దీంతో తోటకూర వెంకట రమణారావు 17,093 ఓట్ల భారీ మెజారిటీతో చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకున్నారు. చైర్‌పర్సన్ ఎన్నికలో నమోదైన భారీ మెజారిటీతో పాటు కౌన్సిలర్ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు పెద్ద సంఖ్యలో విజయం సాధించడం తెనాలి ఎన్నికల ఫలితాల్లో ప్రధాన అంశంగా నిలిచింది. ఫలితాలు వెలువడిన వెంటనే కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు.

52లో 46 కూటమి ఖాతాలో : తెనాలి మున్సిపాలిటీలోని మొత్తం 52 కౌన్సిలర్ వార్డుల్లో తెలుగుదేశం పార్టీ 29 స్థానాలను గెలుచుకుంది. జనసేన పార్టీ 16 వార్డుల్లో విజయం సాధించింది. బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది. వైఎస్సార్‌సీపీ ఆరు వార్డుల్లో విజయం సాధించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి మొత్తం 46 వార్డులను కైవసం చేసుకోవడంతో మున్సిపాలిటీలో కూటమికి స్పష్టమైన మెజారిటీ లభించింది. ఇందులో టీడీపీ 29 స్థానాలతో అతి పెద్ద పార్టీగా నిలవగా, జనసేన 16 స్థానాలతో కూటమి బలాన్ని మరింత పెంచింది. బీజేపీ సైతం ఒక వార్డును గెలుచుకుంది.

అలపాటి వ్యూహం.. క్షేత్రస్థాయిలో సమన్వయం : ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి అలపాటి రాజేంద్ర ప్రసాద్ కూటమి అభ్యర్థులతో నిరంతరం సమన్వయం కొనసాగించారు. వార్డుల వారీగా పరిస్థితులను సమీక్షిస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం, వార్డు స్థాయి సమావేశాలపై దృష్టి సారించారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో అలపాటి కీలకంగా వ్యవహరించారు. అభ్యర్థులకు అవసరమైన సహకారం అందిస్తూ, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించి ప్రచార వ్యూహాలను రూపొందించారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలకు అండదాటులో ఉంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు నడిపించారు.

ప్రతి వార్డుపై ప్రత్యేక దృష్టి : తెనాలి పట్టణంలోని ప్రతి వార్డులో కూటమి పరిస్థితిని అంచనా వేసి ప్రచారాన్ని విస్తృతం చేయడంపై అలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించి అభ్యర్థుల బలాబలాలు, స్థానిక సమస్యలు, ప్రజల ఆకాంక్షలపై చర్చించారు. ఇంటింటి ప్రచారం, ప్రజలతో ముఖాముఖి సమావేశాలు, వార్డు స్థాయి సమావేశాలు, కార్యకర్తల సమన్వయంతో కూటమి ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. అభ్యర్థులు ప్రజలకు అందుబాటులో ఉండేలా, స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావించేలా ప్రచార కార్యక్రమాలను రూపొందించారు.

కలిసి ప్రచారం : అలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో పాటు మంత్రి మనోహర్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితర కూటమి నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. తెనాలి పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని కూటమి నాయకులు ప్రజలకు వివరించారు.

టీడీపీకి 29 స్థానాలు : టీడీపీ 29 వార్డుల్లో విజయం సాధించడం ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేకంగా నిలిచింది. తెనాలి పట్టణంలో పార్టీ సంస్థాగత బలం, వార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తల సమన్వయం ఈ ఫలితాల్లో ప్రతిబింబించింది. జనసేన 16 వార్డుల్లో విజయం సాధించడంతో కూటమి బలం మరింత పెరిగింది. బీజేపీ ఒక స్థానాన్ని గెలుచుకోవడంతో మొత్తం కూటమి స్థానాలు 46కు చేరాయి.

కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, స్థానిక నాయకత్వం కలిసి పనిచేయడం ఎన్నికల ప్రచారంలో కీలక అంశంగా నిలిచింది. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ అలపాటి రాజేంద్ర ప్రసాద్ ముందుకు సాగడం కూటమి ప్రచారంలో ప్రత్యేకంగా కనిపించింది.

ఎన్నికల ఫలితాల అనంతరం అలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును విజయంగా మాత్రమే కాకుండా మరింత పెద్ద బాధ్యతగా స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సేవలందించాలని సూచించారు. తెనాలి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.

అభివృద్ధి వైపు తెనాలి అడుగులు : తోటకూర వెంకట రమణారావు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టనున్ననేపథ్యంలో తెనాలి మున్సిపాలిటీ అభివృద్ధిపై కూటమి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రజలు ఇచ్చిన భారీ తీర్పును అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా మలచాలని కూటమి నాయకత్వం భావిస్తోంది.

రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, పట్టణ సుందరీకరణ, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది.

చైర్‌పర్సన్ అభ్యర్థికి 17,093 ఓట్ల భారీ మెజారిటీ రావడం, 52 వార్డుల్లో 46 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం తెనాలి మున్సిపల్ రాజకీయాల్లో కీలక పరిణామంగా నిలిచింది. ముఖ్యంగా టీడీపీ 29 వార్డుల్లో విజయం సాధించడంతో పట్టణంలో పార్టీ బలం స్పష్టమైంది.

ఈ ఎన్నికల్లో కూటమి సాధించిన ఫలితాల నేపథ్యంలో అలపాటి రాజేంద్ర ప్రసాద్ నాయకత్వం, ఎన్నికల సమయంలో ఆయన నిర్వహించిన సమన్వయం, క్షేత్రస్థాయి పర్యటనలు, కార్యకర్తలతో కొనసాగించిన నిరంతర సంప్రదింపులు చర్చనీయాంశంగా మారాయి.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన విజయం : "పదవులు గెలుచుకోవడం మాత్రమే విజయం కాదు. ప్రజల మనసులు గెలుచుకుని, వారి ఆశయాలకు అనుగుణంగా తెనాలి పట్టణాన్ని అభివృద్ధి చేయడమే అసలైన విజయం. ప్రజలు ఇచ్చిన తీర్పును బాధ్యతగా స్వీకరించి మరింత అంకితభావంతో పనిచేస్తాం. ప్రజల సమస్యల పరిష్కారానికి, తెనాలి అభివృద్ధికి కట్టుబడి ఉంటాం" అని అలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి సాధించిన భారీ విజయం నేపథ్యంలో ఇప్పుడు ఎన్నికల హడావుడి ముగిసి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన సమయం మొదలైంది. అలపాటి రాజేంద్ర ప్రసాద్ సమన్వయంలో కూటమి ప్రజాప్రతినిధులు ఏ మేరకు పట్టణ అభివృద్ధిపై దృష్టి సారిస్తారనేది రానున్న రోజుల్లో కీలకంగా మారనుంది.







వైఎస్సార్ కంచుకోటలో కూటమి ప్రభంజనం

కడప(జర్నలిస్ట్ ఫైల్) : దశాబ్దాలుగా వైఎస్సార్ కుటుంబానికి రాజకీయంగా బలమైన స్థావరంగా ఉన్న ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో పురపాలక ఎన్నికల ఫలితాలు సంచలనం సృష్టించాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలోనే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించడంతో జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పులివెందులలో టీడీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి తూగుట్ల గీతాకుమారి 13,875 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించి చరిత్ర సృష్టించారు. జమ్మలమడుగులో చైర్‌పర్సన్‌తో సహా మొత్తం 32 వార్డులను కూటమి కైవసం చేసుకోగా, మైదుకూరులో వైసీపీ ఒక్క వార్డును కూడా గెలుచుకోలేకపోయింది. రాజంపేటలోనూ టీడీపీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. జిల్లా కేంద్రం కడప నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సువర్ణ మాటిల్ 60,863 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడం మరో ప్రధాన పరిణామంగా నిలిచింది. ఒకప్పుడు వైఎస్సార్ కుటుంబానికి రాజకీయంగా బలమైన పట్టున్న ప్రాంతాల్లో వెలువడిన ఈ ఫలితాలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి.

పులివెందులలో చరిత్ర తిరగరాసిన గీతాకుమారి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమైన రాజకీయ స్థావరంగా భావించే పులివెందుల మున్సిపాలిటీలో ఓటర్లు ఇచ్చిన తీర్పు ప్రత్యేక చర్చకు దారితీసింది. నాలుగు దశాబ్దాలుగా వైఎస్సార్ కుటుంబ రాజకీయ ప్రాబల్యం కొనసాగిన ప్రాంతంలో టీడీపీ అభ్యర్థి తూగుట్ల గీతాకుమారి ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీలపై ఆమె 13,875 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. గీతాకుమారికి 25,434 ఓట్లు రాగా, ప్రమీలకు 11,559 ఓట్లు మాత్రమే లభించాయి. పులివెందులలో టీడీపీ అభ్యర్థి సాధించిన ఈ ఫలితం జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామంగా నిలిచింది.



కౌంటింగ్ ప్రారంభమైన తొలి రౌండ్ నుంచే గీతాకుమారి ఆధిక్యం ప్రదర్శించారు. ప్రతి రౌండ్‌లోనూ మెజార్టీని పెంచుకుంటూ ప్రత్యర్థిపై స్పష్టమైన ఆధిపత్యాన్ని కనబరిచారు. చివరకు భారీ ఓట్ల తేడాతో విజయాన్ని ఖరారు చేసుకున్నారు. వైఎస్సార్ కుటుంబానికి బలమైన పట్టున్న పులివెందులలో టీడీపీ అభ్యర్థి సాధించిన ఈ విజయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.


జమ్మలమడుగులో 32కు 32.. కూటమి క్లీన్‌స్వీప్ : జమ్మలమడుగు మున్సిపాలిటీలో ఎన్డీయే కూటమి సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. చైర్‌పర్సన్ పదవితో పాటు మొత్తం 32 వార్డులనూ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీకి ఒక్కవార్డు కూడా దక్కలేదు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని స్థానాలను గెలుచుకోవడంతో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. స్థానికంగా కూటమి నేతలు, కార్యకర్తలు సమష్టిగా నిర్వహించిన ప్రచారం, ఓటర్ల మద్దతు ఈ ఫలితాల్లో ప్రతిబింబించాయి.

మైదుకూరులో వైసీపీకి ఒక్క వార్డూ దక్కలేదు : మైదుకూరు మున్సిపాలిటీలోనూ కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయం సాధించి క్లీన్‌స్వీప్ చేశారు. వైసీపీ ఒక్క వార్డును కూడా గెలుచుకోలేకపోయింది. అంతేకాకుండా ఎనిమిది వార్డుల్లో ఆ పార్టీ అభ్యర్థులు వంద ఓట్లలోపే పరిమితమయ్యారు. దీంతో మైదుకూరు ఫలితం జిల్లా ఎన్నికల్లో మరో కీలక పరిణామంగా నిలిచింది. కూటమి అభ్యర్థుల విజయంతో స్థానికంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రాజంపేట పురపాలక సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తన బలాన్ని చాటుకుంది. కౌంటింగ్ పూర్తయిన 17 వార్డుల్లో టీడీపీ 10 స్థానాలను గెలుచుకోగా, వైసీపీ నాలుగు స్థానాలకే పరిమితమైంది. బీజేపీ ఒక వార్డును, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు రెండు వార్డులను గెలుచుకున్నారు. కొన్నివార్డుల్లో పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. 29వ వార్డులో టీడీపీ అభ్యర్థి అర్షియా షేక్ కేవలం ఎనిమిది ఓట్ల తేడాతో విజయం సాధించారు. 25వ వార్డులో మందా శివపార్వతి 16 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలుపొందారు. మూడో వార్డులో బీజేపీ అభ్యర్థి బావిరిశెట్టి చిన్నరెడ్డయ్య 387 ఓట్లతో విజయం సాధించారు. 22వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి రేనాటి రాఘవేంద్ర వర్మ, 27వ వార్డులో పోతుల సంపూర్ణ విజయం సాధించారు. రాజంపేట ఫలితాల్లో టీడీపీ అత్యధిక వార్డులను గెలుచుకోవడం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

కడప కార్పొరేషన్‌లో భారీ మెజార్టీ.. సువర్ణ మాటిల్ ఘన విజయం : జిల్లా కేంద్రమైన కడప నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల ఫలితం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సువర్ణ మాటిల్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. మంగళవారం పూర్తయిన ఓట్ల లెక్కింపు ప్రకారం సువర్ణ మాటిల్‌కు 1,21,828 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి దీప్తికి 60,965 ఓట్లు వచ్చాయి. దీంతో సువర్ణ మాటిల్ 60,863 ఓట్ల భారీ మెజార్టీతో విజయం నమోదు చేశారు. ప్రారంభ రౌండ్ల నుంచే ఆధిక్యంలో కొనసాగిన ఆమె చివరి వరకు అదే జోరును ప్రదర్శించారు. కడప నగరపాలక సంస్థలో టీడీపీ అభ్యర్థి సాధించిన ఈ భారీ మెజార్టీ జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది.

కూటమి శ్రేణుల్లో సంబరాలు.. రాజకీయంగా కీలక పరిణామం : ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని పలు పురపాలక సంస్థల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయాలతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో సంబరాలు వెల్లివిరిశాయి. పులివెందులలో గీతాకుమారి భారీ విజయం, జమ్మలమడుగు, మైదుకూరుల్లో సంపూర్ణ ఆధిపత్యం, రాజంపేటలో టీడీపీ ఆధిక్యం, కడప కార్పొరేషన్‌లో సువర్ణ మాటిల్ రికార్డు మెజార్టీతో గెలుపొందడం ఈ ఎన్నికల ప్రధాన విశేషాలుగా నిలిచాయి. కోర్టు వివాదాలు, రీపోలింగ్ డిమాండ్లు, రాజకీయ ఆరోపణల మధ్య సాగిన ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు తమ ఓటు హక్కుతో తీర్పు ఇచ్చారు. ఈ ఫలితాలు జిల్లా రాజకీయ సమీకరణాల్లో మార్పులకు దారితీసే అవకాశముండటంతో రానున్న రోజుల్లో స్థానిక రాజకీయ పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం



అసాధారణ పరిస్థితుల్లో విమాన ఛార్జీలపై కేంద్ర జోక్యం

ఆకాశాన్నంటుతున్న విమాన ఛార్జీలకు కళ్లెం అవసరం

ప్రయాణికుల ప్రయోజనాలే కేంద్రంగా ప్రభుత్వ జోక్యానికి కొత్త నిబంధనలు

విమాన ప్రయాణం నేడు విలాసవంతమైన ప్రయాణ సాధనం మాత్రమే కాదు.. దేశ ఆర్థిక, సామాజిక చలనశీలతకు కీలకమైన రవాణా వ్యవస్థగా మారింది. వ్యాపారం, ఉద్యోగం, వైద్యం, విద్య, అత్యవసర అవసరాలు, కుటుంబ ప్రయాణాలు.. ఇలా అనేక సందర్భాల్లో విమాన సేవలపై ఆధారపడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే ఇదే సమయంలో కొన్ని సందర్భాల్లో విమాన టికెట్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటడం సామాన్య ప్రయాణికులకు తీవ్ర భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో విమాన ఛార్జీల విషయంలో అవసరమైనప్పుడు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం కల్పిస్తూ కొత్త నిబంధనలు తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ లిలి'భారతీయ వాయుయాన్ నియమ్-2026'లిలిను నోటిఫై చేసింది. అక్టోబర్ 31న గెజిట్‌లో ప్రచురితమైన ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. వీటిలోని రూల్ 192 ప్రకారం సాధారణ పరిస్థితుల్లో విమానయాన సంస్థలు తమ నిర్వహణ వ్యయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఛార్జీలను నిర్ణయించుకోవచ్చు. అయితే అసాధారణ పరిస్థితి ఏర్పడిందని, ప్రజా ప్రయోజనం దృష్ట్యా జోక్యం అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తే.. సంబంధిత విమానయాన సంస్థలకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసే అధికారం ఉంటుంది. అలాంటి ఆదేశాలు పరిస్థితులకు అనుగుణంగా, పరిమిత కాలానికి మాత్రమే ఉండాలి. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. కొత్త నిబంధనలు ప్రతి విమాన టికెట్ ధరను కేంద్ర ప్రభుత్వం రోజువారీగా నిర్ణయించే విధానాన్ని తీసుకురాలేదు. విమాన ఛార్జీలపై శాశ్వతంగా ఒక గరిష్ఠ పరిమితిని కూడా విధించలేదు. సాధారణ రోజుల్లో డిమాండ్, సీజన్, ఇంధన ధరలు, నిర్వహణ వ్యయం, ముందస్తు బుకింగ్ తదితర మార్కెట్ అంశాల ఆధారంగానే విమానయాన సంస్థలు ధరలను నిర్ణయించుకుంటాయి. అంటే ఇది సంపూర్ణ ధర నియంత్రణ కంటే.. అసాధారణ పరిస్థితుల్లో ప్రభుత్వానికి తాత్కాలికంగా జోక్యం చేసుకునే 'సేఫ్టీ వాల్వ్'ను ఏర్పాటు చేయడం.

పారదర్శకత పెరగడం మంచి పరిణామం : కొత్త నిబంధనల్లో మరో ముఖ్యమైన అంశం ఛార్జీల పారదర్శకత. విమానయాన సంస్థలు తమ టారిఫ్‌లను వెబ్‌సైట్లు, ఇతర డిజిటల్ వేదికల్లో వెల్లడించాలి. బుకింగ్ సమయంలో, టికెట్‌పై ప్రయాణికుడు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని స్పష్టంగా చూపడంతోపాటు.. బేస్ ఫేర్, పన్నులు, ఫీజులు, రద్దు ఛార్జీలు, రీఫండ్ నిబంధనలు, ఇతర అదనపు చార్జీలను విడివిడిగా చూపించాల్సి ఉంటుంది. దేశంలో విమాన ఛార్జీలపై ప్రయాణికులకున్న ప్రధాన ఫిర్యాదుల్లో ఒకటి చివరి దశలో అదనపు రుసుములు బయటపడటం. ఈ సమస్యకు పారదర్శకమైన ధరల ప్రదర్శన కొంతమేర పరిష్కారం చూపగలదు. విమానయాన సంస్థలు నిర్ణయించే టారిఫ్‌లను డీజీసీఏ పర్యవేక్షించనుంది. అయితే ఇక్కడ కూడా నియంత్రణ వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నదే అసలు ప్రశ్న. నిబంధనల్లో 'అసాధారణ పరిస్థితి'కు ఖచ్చితమైన నిర్వచనం లేదా ధరల పెరుగుదలకు నిర్దిష్ట పరిమితి ఇవ్వలేదు. అందువల్ల కేంద్రం జోక్యం ఎప్పుడు అవసరమవుతుంది? ఏ స్థాయిలో ఛార్జీల పెరుగుదలను అసాధారణంగా పరిగణిస్తారు? ఏ మార్గాల్లో, ఎంతకాలం ధరలను నియంత్రిస్తారు? వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ విధానం అవసరం.

అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికుల రక్షణ ముఖ్యం

ప్రకృతి వైపరీత్యాలు, పెద్దఎత్తున విమాన సర్వీసుల రద్దు, యుద్ధ పరిస్థితులు, ఆకస్మిక రవాణా అంతరాయాలు, ముఖ్యమైన జాతీయ సంఘటనలు వంటి సందర్భాల్లో విమాన ప్రయాణానికి డిమాండ్ ఒక్కసారిగా పెరగవచ్చు. అటువంటి సమయంలో పరిమిత సీట్లను సాకుగా చూపి ఛార్జీలను అనూహ్య స్థాయికి పెంచితే అత్యవసరంగా ప్రయాణించాల్సిన సామాన్యులు తీవ్రంగా నష్టపోతారు. గతంలోనూ అధిక విమాన ఛార్జీలపై ఫిర్యాదులు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఎయిర్‌ఫేర్ సంబంధిత ఫిర్యాదుల కోసం ఎయిర్‌సేవా వ్యవస్థలో ప్రత్యేక విభాగాన్ని అందుబాటులో ఉంచింది.

అయితే ప్రభుత్వ జోక్యం ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేంత బలంగా ఉండాలి. అదే సమయంలో విమానయాన సంస్థల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీయకుండా సమతుల్యత పాటించాలి. ఇంధన వ్యయం, విమానాల నిర్వహణ, సిబ్బంది వ్యయం, విమానాశ్రయ రుసుములు వంటి వాస్తవ ఖర్చులను విస్మరించి కృత్రిమంగా ఛార్జీలను తగ్గించడం కూడా దీర్ఘకాలంలో విమానయాన రంగానికి హానికరం. పోటీ పెరగడం, కొత్త సంస్థలకు అవకాశాలు కల్పించడం, విమానాల సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలే స్థిరమైన పరిష్కారానికి దోహదపడతాయి.

కేవలం అధికారం సరిపోదు.. అమలు ముఖ్యం : భారతదేశంలో 1994 నుంచి విమాన ఛార్జీల నిర్ణయం ప్రధానంగా మార్కెట్ ఆధారితంగానే కొనసాగుతోంది. కొత్త నిబంధనలు ఆ విధానాన్ని పూర్తిగా మార్చడం లేదు. కానీ అసాధారణ పరిస్థితుల్లో ప్రజా ప్రయోజనం కోసం కేంద్రానికి స్పష్టమైన జోక్యాధికారాన్ని కల్పించడం మాత్రం ముఖ్యమైన మార్పు.

అందువల్ల కొత్త నిబంధనలను కేవలం 'విమాన టికెట్ ధరలను కేంద్రం నియంత్రిస్తుంది' అనే కోణంలో చూడటం సరైంది కాదు. సాధారణ పరిస్థితుల్లో మార్కెట్ స్వేచ్ఛ.. అసాధారణ పరిస్థితుల్లో ప్రజా ప్రయోజన రక్షణ.. ధరల విషయంలో పారదర్శకత.. నియంత్రణ సంస్థ పర్యవేక్షణ అనే నాలుగు అంశాల మధ్య సమతుల్యతే ఈ విధానం విజయాన్ని నిర్ణయిస్తుంది.

ప్రభుత్వం జోక్యం చేసుకునే పరిస్థితులను ముందుగానే స్పష్టంగా నిర్వచించడం, నిర్ణయాలకు పారదర్శక ప్రమాణాలను రూపొందించడం, ప్రయాణికుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం, విమానయాన సంస్థలపై సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టడం అవసరం. లేకపోతే మంచి ఉద్దేశంతో రూపొందించిన నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

విమాన ప్రయాణం కొద్దిమంది సంపన్నుల సౌకర్యం నుంచి కోట్లాది ప్రజల అవసరంగా మారుతున్న నేపథ్యంలో 'విమానయాన రంగం అభివృద్ధి'తో పాటు 'ప్రయాణికుల హక్కుల రక్షణ'కు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ఆకాశంలో విమానాలు స్వేచ్ఛగా ఎగరాలి.. కానీ అత్యవసర పరిస్థితుల్లో టికెట్ ధరలు మాత్రం సామాన్యుల అందుబాటుకు అందనంత ఎత్తుకు ఎగరకుండా ప్రభుత్వం నిఘా ఉంచాలి. అదే కొత్త నిబంధనల అసలు పరీక్ష.

- **మీడియా కథనంతో కదిలిన ప్రభుత్వం.. నారా లోకేశ్ చొరవతో స్పందన**
- **ఎంపీ ల్యాడ్స్ నుంచి అంబులెన్స్‌కు చింతకాయల విజయ్ హామీ**

అంబులెన్స్ రాని చోట..

అమ్మే అంబులెన్స్



ఒక తల్లి తన అనారోగ్యంతో ఉన్న కుమార్తెను భుజాలపై మోసుకుంటూ కొండలు, గుట్టలు దాటుతూ ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి. గ్రామానికి రహదారి లేదు. అంబులెన్స్ వెళ్లే అవకాశం లేదు. అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో వాహనం కోసం ఎదురుచూడటం తప్ప మరో మార్గం లేదు. చివరకు కన్నతల్లే అంబులెన్స్‌గా మారి తన బిడ్డను భుజాన మోసుకెళ్లిన విషాద ఘటన విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని పల్లపు దుంగాడ గ్రామంలో వెలుగుచూసింది.

ఇది కేవలం ఒక తల్లి కన్నీటి కథ కాదు. మారుమూల గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఎంత దూరంగా ఉన్నాయో చాటిచెప్పే కఠోర వాస్తవం. అభివృద్ధి గురించి గొప్పగా చెప్పుకుంటున్న సమయంలో.. ఒక అనారోగ్యంతో ఉన్న చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తల్లి ఏడు కిలోమీటర్లు భుజాన మోసుకెళ్లాల్సి రావడం పాలనా వ్యవస్థకు అద్దం పట్టే ఘటన.

కన్నతల్లి కష్టాన్ని కళ్లకు కట్టిన కథనం : అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తల్లి పడిన వేదనను మీడియా వెలుగులోకి తీసుకురావడం అభినందనీయం. గ్రామానికి రహదారి లేకపోవడం, అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా చేరుకోలేని పరిస్థితి, చికిత్స కోసం తల్లి పడిన కష్టాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం ద్వారా ఈ సమస్య కేవలం ఒక కుటుంబ సమస్యగా కాకుండా పాలనకు సంబంధించిన అంశంగా మారింది.

ప్రజల కష్టాలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. అదే సమయంలో ఆ కష్టాలపై పాలకులు స్పందించి పరిష్కారాలు చూపడం ప్రజా పాలనకు అసలు పరీక్ష. ఈ ఘటనలో రెండో దశలోనైనా స్పందన కనిపించడం కొంత ఊరటనిచ్చే అంశం.

మీడియా కథనంతో కదిలిన ప్రభుత్వం : మీడియా ప్రసారం చేసిన కథనం పాలకులను కదిలించింది. గిరిజన గ్రామంలో నెలకొన్న దుస్థితి, కన్నతల్లి పడిన వేదన గురించి తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. ఆ గ్రామానికి అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంత్రి లోకేశ్ చొరవతో సమస్య పరిష్కార దిశగా కదలిక రావడం స్వాగతించదగిన విషయం. ఒక వార్త వెలుగులోకి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, అత్యవసర వైద్య సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం ప్రజా ప్రతినిధుల స్పందన ఎలా ఉండాలో చూపిస్తుంది.

ఎంపీ ల్యాడ్స్ నుంచి అంబులెన్స్ : మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ కూడా స్పందించారు. పల్లపు దుంగాడ గ్రామానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చారు. తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి గ్రామానికి అంబులెన్స్ సమకూర్చనున్నట్లు ప్రకటించారు.

ఇది తక్షణ సమస్యకు ఒక ముఖ్యమైన పరిష్కారం. అంబులెన్స్ అందుబాటులోకి వస్తే ఇకపై అనారోగ్యంతో ఉన్నవారిని అత్యవసర సమయంలో భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి కొంతవరకు తొలగుతుంది.

"ఇది నా వంతుగా చేస్తున్న ఒక చిన్న ప్రయత్నం. భవిష్యత్తులో ఏ తల్లీ కూడా తన బిడ్డ ప్రాణాలను కాపాడుకోవడానికి అంబులెన్స్ లేక ఇలాంటి కష్టాలు పడకూడదు" అని చింతకాయల విజయ్ పేర్కొనడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

అంబులెన్స్ వచ్చింది.. కానీ రహదారి సమస్య? : అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. లిలిఅంబులెన్స్ ఇవ్వడం తక్షణ పరిష్కారం. కానీ ఆ అంబులెన్స్ గ్రామానికి చేరే రహదారి లేకపోతే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందా?

ఇది ప్రభుత్వం ఆలోచించాల్సిన అంశం : అంబులెన్స్ ఒక అవసరం. రహదారి అంతకంటే పెద్ద అవసరం. అత్యవసర వైద్య సేవలు మాత్రమే కాదు.. పాఠశాలలు, వైద్యశాలలు, మార్కెట్లు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సేవలు, విద్యార్థుల రాకపోకలు.. అన్నింటికీ రహదారి అవసరం.

ఫైళ్లలో కాదు.. నేలపై కనిపించాలి : గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. గ్రామీణ రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నాయి. అయినప్పటికీ కొన్ని గ్రామాలు ఇప్పటికీ రహదారి కోసం ఎదురుచూడాల్సి రావడం ఆందోళనకరం.

అనుమతులు, అటవీ శాఖ అభ్యంతరాలు, నిధుల కొరత, అంచనాల పెంపు వంటి కారణాలు పనుల ఆలస్యానికి ఉండవచ్చు. కానీ ఒక ఫైలు ఆలస్యం కావడం వెనుక ఒక కుటుంబం ప్రాణం ప్రమాదంలో పడకూడదు. ఒక అనుమతి కోసం నెలలు, సంవత్సరాలు గడిచేలోపు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎంతటి మూల్యం చెల్లిస్తున్నారో అధికారులు గుర్తించాలి.

లిప్రభుత్వ పథకం అంటే ఫైల్లో మంజూరు కావడం కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు రావడం.

ఒక్క గ్రామం కాదు.. ఇలాంటి గ్రామాలన్నింటినీ గుర్తించాలి

పల్లపు దుంగాడ ఘటన వెలుగులోకి వచ్చింది కాబట్టి స్పందన వచ్చింది. కానీ రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇంకా ఎన్ని గ్రామాలకు ఇలాంటి పరిస్థితి ఉందో ప్రభుత్వం సమగ్రంగా గుర్తించాలి.

రహదారి సౌకర్యం లేని గ్రామాలు, అంబులెన్స్ చేరుకోలేని ఆవాసాలు, అత్యవసర వైద్య సేవలకు దూరంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక సర్వే నిర్వహించాలి. ప్రతి గ్రామానికి కనీస రహదారి, అత్యవసర రవాణా, వైద్య సేవలు అందేలా కార్యాచరణ రూపొందించాలి.

ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, అత్యవసర వైద్యం అవసరమైన రోగులు ఇబ్బందులు పడకుండా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేయాలి.

మీడియా ప్రశ్నిస్తే.. పాలకులు స్పందించాలి : ఈ ఘటన మరో విషయాన్ని కూడా స్పష్టం చేసింది. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్ర ఎంత కీలకమో ఇది మరోసారి నిరూపించింది. ఒక కుటుంబం ఎదుర్కొన్న కష్టాన్ని వార్తగా ప్రసారం చేయడంతో అది ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. మంత్రి స్పందించారు. ఎంపీ ముందుకొచ్చారు. అంబులెన్స్ సౌకర్యానికి మార్గం ఏర్పడింది.

ఇదే ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర : అయితే సమస్యలను వెలుగులోకి తెచ్చిన తర్వాతే పాలన కదలడం కాకుండా.. లిలిప్రజల సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే వ్యవస్థగా పాలన మారాలి.లిలి ప్రజలు తమ కష్టాలను వార్తలుగా మారిన తర్వాతే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన పరిస్థితి ఉండకూడదు.

అమ్మ భుజాలపై బిడ్డ కాదు.. ప్రభుత్వ బాధ్యత ఉండాలి : ఒక తల్లి తన బిడ్డను భుజాలపై మోసింది. అది తల్లి ప్రేమకు ప్రతీక. కానీ అదే దృశ్యం ప్రభుత్వ వ్యవస్థకు మాత్రం ప్రశ్నార్థకం.

మీడియా కథనం స్పందనను తీసుకొచ్చింది. నారా లోకేశ్ చొరవ చూపించారు. చింతకాయల విజయ్ ఎంపీ ల్యాడ్స్ నుంచి అంబులెన్స్ అందించేందుకు ముందుకొచ్చారు. ఈ చర్యలు అభినందనీయం. అయితే ఈ స్పందన ఇక్కడితో ఆగకూడదు.

పల్లపు దుంగాడకు అంబులెన్స్ చేరే రహదారి కూడా నిర్మించాలి. రాష్ట్రంలోని రహదారి లేని ప్రతి గిరిజన ఆవాసానికి కనీస రవాణా సౌకర్యం కల్పించాలి.

ఎందుకంటే అభివృద్ధి అంటే కొద్ది మంది ప్రయాణించే పెద్ద రహదారులు మాత్రమే కాదు. మారుమూల కొండపై ఉన్న ఒక కుటుంబం అత్యవసర సమయంలో ఆస్పత్రికి చేరుకోగలగడం కూడా అభివృద్ధే.

ఇకపై ఏ తల్లీ తన బిడ్డను భుజాన మోసుకుని ఆస్పత్రి దారి పట్టాల్సిన పరిస్థితి రాకుండా చేయడమే ఈ ఘటన నుంచి ప్రభుత్వం తీసుకోవాల్సిన అసలు పాఠం.

యువత గళాన్ని వినాల్సిన సమయం



- **పలు దేశాల్లో విస్తరిస్తున్న జెన్-జీ ఆందోళనలు..**
- **రోడ్డెక్కిన జెన్-జీ.. పాలకులకు పెరుగుతున్న ఒత్తిడి**
- **విధానాలపై పెరుగుతున్న అసంతృప్తికి సంకేతం**
- **జెన్-జీ ఆగ్రహం.. పాలకులకు హెచ్చరిక**
- **ఆందోళనలను అణచడం కాదు.. యువత సమస్యలను వినాలి**

ఒకప్పుడు హాలోవీన్ అంటే వినోదం, కాస్ట్యూమ్ పార్టీలు, సంబరాలే గుర్తుకొచ్చేవి. కానీ ఈసారి యూరప్‌లోని పలు నగరాల్లో అదే రోజు యువత నిరసనలకు వేదికగా మారింది. ఫ్రాన్స్‌లో మొదలైన యువత ఆందోళనల ప్రభావం జర్మనీ సహా ఇతర యూరోపియన్ దేశాలకూ విస్తరిస్తోంది. బెర్లిన్, ఫ్రాంక్‌ఫర్ట్, కొలోన్, మ్యూనిచ్ వంటి నగరాల్లో జెన్-జీ యువత విద్య, ఉపాధి, జీవన వ్యయం, పర్యావరణం, ప్రభుత్వ విధానాలపై తమ అసంతృప్తిని వ్యక్తం చేసింది.

ఇది కేవలం ఒక దేశానికి పరిమితమైన నిరసన కాదు. ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, బెల్జియం, గ్రీస్, అల్బేనియా, జర్మనీ తదితర దేశాల్లో యువత వివిధ సమస్యలపై రోడ్డెక్కుతోంది. దేశానికో సమస్య ఉన్నప్పటికీ.. వాటన్నింటి వెనుక ఒక సాధారణ భావన కనిపిస్తోంది. లిలితమ భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకునే సమయంలో తమ మాటకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తి.లిలి

సమస్యలు వేరు.. ఆందోళన ఒక్కటే : యువత నిరసనలకు కారణాలు దేశానికో రకంగా ఉన్నాయి. ఫ్రాన్స్‌లో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సిబ్బంది కొరత, పాఠశాలల మౌలిక వసతుల సమస్యలు, విద్యకు తగిన నిధులు కేటాయించకపోవడం ప్రధాన అంశాలుగా ముందుకొచ్చాయి. స్పెయిన్, పోర్చుగల్‌లో గృహాల అద్దెలు, అందుబాటులో లేని ఇళ్ల ధరలు, జీవన వ్యయం యువతను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఇటలీలో విద్య, జీవన వ్యయం, సామాజిక విధానాలపై నిరసనలు జరిగాయి. జర్మనీలో విద్యకు నిధుల పెంపుతో పాటు తప్పనిసరి సైనిక సేవ ప్రతిపాదనలపై యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది.

అంటే ఈ ఉద్యమాలన్నింటినీ ఒకే రాజకీయ నినాదంతో అర్థం చేసుకోవడం సరికాదు. విద్య, ఉపాధి, గృహ వసతి, జీవన వ్యయం, సామాజిక భద్రత, సైనిక విధానం వంటి భిన్నమైన అంశాలు యువత అసంతృప్తికి కారణమవుతున్నాయి. అయితే వీటి అంతర్లీనంగా ఉన్నది మాత్రం లిలిస్థిరమైన భవిష్యత్తు కోసం పెరుగుతున్న ఆందోళన.

ఆర్థిక భద్రతపై భయం : యువతకు ఉద్యోగం లభించడం మాత్రమే ఇప్పుడు సరిపోవడం లేదు. ఉద్యోగం ఉన్నా ఇల్లు కొనలేని పరిస్థితి, చదువు పూర్తయినా భారీ అప్పులు, పెరుగుతున్న అద్దెలు, నిత్యావసరాల ధరలు, సామాజిక భద్రతపై అనిశ్చితి వంటి సమస్యలు యువతలో భవిష్యత్తుపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి.

యూరోపియన్ యూనియన్‌లో 16-30 ఏళ్ల వయసు వారిలో 40 శాతం మంది జీవన వ్యయాన్ని ముఖ్యమైన ఆందోళనగా పేర్కొంటున్నారని రాయిటర్స్ విశ్లేషణ వెల్లడించింది. 2025లో 18--24 ఏళ్ల వయసున్న యూరోపియన్ యువతలో 26.3 శాతం మంది పేదరికం లేదా సామాజిక వెలివేత ముప్పును ఎదుర్కొన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు భవిష్యత్ తరాల సమస్యలను ప్రస్తుత ఆర్థిక లెక్కల్లో ఒక అంశంగా మాత్రమే చూడటం సరిపోదు. యువతకు లిలివిద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు, అందుబాటు గృహాలు, సామాజిక భద్రతలిలి కల్పించే దీర్ఘకాలిక విధానాలు అవసరం.

సోషల్ మీడియా.. ఉద్యమాలకు కొత్త వేగం : ప్రస్తుత యువత ఉద్యమాలకు మరో ప్రత్యేకత సోషల్ మీడియా. గతంలో ఒక దేశంలో ప్రారంభమైన నిరసన మరో దేశానికి చేరుకోవడానికి రోజులు, వారాలు పట్టేవి. ఇప్పుడు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా కొన్ని గంటల్లోనే ఒక నిరసన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్నాయి. ఫ్రాన్స్‌లోని ఆందోళనల దృశ్యాలు ఇతర దేశాల యువతపై ప్రభావం చూపుతున్నాయని సామాజిక ఉద్యమాలపై పరిశోధకులు పేర్కొంటున్నారు.

అయితే సోషల్ మీడియా ఉద్యమాలకు వేగం ఇవ్వగలదే తప్ప.. వాటికి స్పష్టమైన విధాన దిశను ఇవ్వలేదు. ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం సులభం.. కానీ ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించడం, వాటిని ప్రజాస్వామ్య వ్యవస్థలో అమలు చేయించడం మాత్రం మరింత కష్టమైన పని.

నిరసన హక్కు.. హింసకు అనుమతి కాదు : ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు పౌరులకు ఉంది. యువత తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య చైతన్యానికి సంకేతం. అదే సమయంలో నిరసనల పేరుతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, దోపిడీ, పోలీసులపై దాడులు చేయడం సమర్థనీయం కాదు.

ఇటీవలి యూరోపియన్ నిరసనల్లో అధిక భాగం శాంతియుతంగా సాగినప్పటికీ.. కొన్ని ప్రాంతాల్లో హింస, విధ్వంసం చోటుచేసుకున్నాయి. అందువల్ల శాంతియుత నిరసనకారుల హక్కులను గౌరవిస్తూ, హింసకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం మధ్య ప్రభుత్వాలు సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉంది.

పాలకులకు ఒక హెచ్చరిక : యువతను కేవలం ఎన్నికల సమయంలో గుర్తు చేసుకునే ఓటర్లుగా చూడటం ఏ ప్రభుత్వానికీ దీర్ఘకాలంలో ప్రయోజనం చేకూర్చదు. వారు భవిష్యత్ ఉద్యోగులు మాత్రమే కాదు.. రేపటి పన్ను చెల్లింపుదారులు, ఓటర్లు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు. వారి సమస్యలు పరిష్కరించకుండా ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణమే. అందుకే యూరప్‌లో జరుగుతున్న పరిణామాలను కేవలం 'జెన్-జీ తిరుగుబాటు'గా చూడటం కంటే.. యువత ఎందుకు అసంతృప్తికి గురవుతోందో పరిశీలించడం అవసరం. వారి డిమాండ్లలో ఏవి తక్షణ పరిష్కారం కోరుతున్నాయి? ఏవి దీర్ఘకాలిక విధాన మార్పులు అవసరం చేస్తున్నాయి? అనే అంశాలపై ప్రభుత్వాలు చర్చించాలి. యువత రోడ్డెక్కిన తర్వాత స్పందించడం కంటే.. వారు రోడ్డెక్కకముందే వారి సమస్యలను వినడం ప్రజాస్వామ్య పాలనకు నిజమైన పరీక్ష.

లిలియువత గళం కేవలం నిరసన శబ్దం కాదు.. రాబోయే సమాజం ఎలా ఉండాలన్న దానిపై వినిపిస్తున్న ముందస్తు హెచ్చరిక. దాన్ని అణచివేయడం కంటే అర్థం చేసుకోవడం, ఆవేశాన్ని విధాన చర్చగా మార్చడం, భవిష్యత్తుపై వారికి విశ్వాసం కల్పించడం పాలకుల బాధ్యత.

కూటమి సుపరిపాలనకు ప్రజలు అండగా నిలిచారు

- పట్టణ ప్రాంత స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై సీఎం చంద్రబాబు స్పందన



అమరావతి, నవంబర్ 3 (జర్నలిస్ట్ ఫైల్) : కూటమి ప్రభుత్వం అందిస్తోన్న సుపరిపాలనకు స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పు ద్వారా మద్దతు తెలిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై ఈ మేరకు మీడియా సమావేశంలో స్పందించారు. అనునిత్యం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించే ప్రజలు కూటమికి అండగా నిలిచారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందనే నమ్మకం, విశ్వాసం ప్రజల్లో ఉందని అందుకే పట్టణ ప్రాంత స్థానిక ఎన్నికల్లో ప్రజల మద్దతు లభించిందని చెప్పారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే పాలన సాగిస్తున్నామని స్పష్టం చేశారు. రాజకీయాలా? ప్రజా సమస్యల పరిష్కారమా? అని నిర్ణయించుకోవాల్సి వస్తే తాను సమస్యల పరిష్కారనికే ప్రాధాన్యత ఇస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు సేవలందించే క్రమంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని గుర్తించి సరిదిద్దుకుంటున్నామని, ప్రజలు మెచ్చే పాలన అందించడంతో పాటు వారి ఇబ్బందులను తొలగించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేశామని చంద్రబాబు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్నామని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని అందించామని గుర్తుచేశారు. అమరావతి నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. గత పాలకులు రోడ్లను ధ్వంసం చేస్తే.. తమ ప్రభుత్వం తిరిగి రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తోందని వివరించారు. రాష్ట్రంలో అన్ని సమస్యలూ పరిష్కారమైపోయాయని తాము చెప్పడం లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలకుల నుంచి వారసత్వంగా వచ్చిన అనేక సమస్యలు ఇంకా ఉన్నాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. రాజకీయ పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రభుత్వం ప్రజలందరికీ సేవలు అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. గుడ్ పాలిటిక్స్.. గుడ్ గవర్నెన్స్.. ఇదే తన విధానమని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తే.. ప్రజలే తమకు అండగా నిలుస్తారనేది తన నమ్మకం అన్నారు. ఇదే విధంగా కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

రిఫైనరీలో అగ్నిప్రమాదం

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్): విశాఖ పారిశ్రామిక ప్రాంతం సోమవారం రాత్రి భారీ పేలుడుతో ఉలిక్కిపడింది. హెచ్‌పీసీఎల్‌కు చెందిన విశాఖ రిఫైనరీలో రాత్రి 9.50 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించి భారీగా మంటలు చెలరేగాయి. ఇటీవల విస్తరించిన రిఫైనరీ ప్రాజెక్టులోని రఫ్ (థార్) పిచ్ యూనిట్‌లో సల్ఫర్ ట్యాంకుల కింద ఉన్న వ్యర్థ చమురు ట్యాంకులో ఈ పేలుడు జరిగినట్లు అధికారులు తెలిపారు.

పేలుడు ధాటికి భారీ శబ్దం వినిపించడంతో పాటు క్షణాల్లోనే మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన నల్లటి పొగ పరిసర ప్రాంతాలను కమ్మేసింది. తొలుత రిఫైనరీ చిమ్నీ నుంచి సాధారణంగా వెలువడే మంటలుగానే అధికారులు భావించినప్పటికీ, మంటల తీవ్రత పెరగడంతో అప్రమత్తమయ్యారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మంటల తీవ్రత క్రమంగా తగ్గింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అయితే భారీగా వెలువడిన నల్లటి పొగ శ్రీహరిపురం, మల్కాపురం ప్రాంతాలను కమ్మేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదంపై ముందస్తు హెచ్చరికలు ఇవ్వలేదని, కనీసం సైరన్లు కూడా మోగించలేదని కొందరు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు రిఫైనరీకి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని మల్కాపురం సీఐ ఇ.నరసింహారావు తెలిపారు. వెస్ట్ జోన్ ఏసీపీ ప్రదీప్తి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కూడా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రమాద పరిస్థితిపై ఆరా తీశారు. సమీపంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆయిల్ టెర్మినల్ యాజమాన్యం కూడా ముందస్తు భద్రత చర్యలు చేపట్టింది.

రాష్ట్రాన్ని ముంచెత్తిన 'మురసు' తుపాను

(మొదటి పేజీ తరువాయి)

చీరాలలో 230 మి.మీ. వర్షపాతం : మురసు తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు చీరాలలో అత్యధికంగా 230 మి.మీ. వర్షం కురిసింది. ఇది అత్యంత భారీ వర్షపాతం కేటగిరీలో నమోదైంది. నరసరావుపేటలో 182.51 మి.మీ., విజయవాడలో 119.75 మి.మీ., గుంటూరులో 74.96 మి.మీ., పిడుగురాళ్లలో 47.45 మి.మీ. వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా విజయవాడలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. కేవలం రెండు గంటల వ్యవధిలోనే 64.25 మి.మీ. వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తుపాను ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా పడింది. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 30,661 హెక్టార్లలో వరి, 21,474 హెక్టార్లలో పత్తి, 605 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. మొత్తంగా 52,740 హెక్టార్లకు పైగా పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. వర్షాలు తగ్గిన అనంతరం క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రైతులు పంటలను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

922 మందికి పునరావాసం : భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 922 మందిని పునరావాస కేంద్రాలకు చేర్చారు. వీరిలో గుంటూరు జిల్లాలో 468 మంది, ప్రకాశం జిల్లాలో 234 మంది, బాపట్ల జిల్లాలో 200 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 20 మంది ఉన్నారు. విజయవాడ, పొన్నూరు, మంగళగిరి–తాడేపల్లి, చీరాల, కందుకూరు, దర్శి ప్రాంతాల నుంచి బాధితులను తరలించారు. నాలుగు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 15 ప్రాంతాలు, 11 నివాస ప్రాంతాలు నీటమునిగినట్లు అధికారులు గుర్తించారు. బాధితులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

తుఫాన్ల సహాయక చర్యల్లో టీమ్ స్పిరిట్‌తో పనిచేశాం

- దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను 4-5 రోజుల్లోనే గాడిన పెట్టాం
- తుఫాన్లు...కరవుపై ఒకేసారి కేంద్ర బృందాలు ఏపీలో పర్యటిస్తున్నాయి
- ప్రకృతి విపత్తులను తట్టుకునేలా శాశ్వత పరిష్కారాలపై అధ్యయనం
- తుఫాన్లలో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేశాం
- అర్నబ్, మురసు తుఫాన్ల సహాయక చర్యలపై ఆర్టీజీఎస్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియా సమావేశం



అమరావతి, నవంబర్ 03 (జర్నలిస్ట్ ఫైల్) : వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుఫాన్లలో ప్రాణనష్టాన్ని నివారిస్తూ, ఆస్తినష్టాన్ని సాధ్యమైనంతగా తగ్గించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళవారం సీఎం చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. వరుస తుఫాన్లపై ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన చర్యలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తుఫాన్ల సమయంలో ప్రభుత్వంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది రాత్రిపగలు అలుపు లేకుండా పనిచేశారని ప్రశంసించారు. ముఖ్యంగా ప్రభావిత జిల్లాల కలెక్టర్లు టీమ్ లీడర్లుగా వ్యవహరించి సహాయక చర్యలను సమర్థంగా సమన్వయం చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి మొదలుకుని స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ టీమ్ స్పిరిట్‌తో పనిచేశారని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, ప్రజల సహకారంతోనే సహాయక చర్యలను సమర్థంగా నిర్వహించగలిగామని సీఎం చెప్పారు. ప్రజల ప్రాణాలను కాపాడటం, ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను త్వరగా పునరుద్ధరించడమే లక్ష్యంగా అందరం సమష్టిగా కృషిచేశామని తెలిపారు. విపత్తు సమయంలో ప్రజల కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. విపత్తు నిర్వహణలో రక్షణ, సహాయక చర్యలు, పునరావాసం అనే మూడు అంశాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని చెప్పారు. తుఫాన్ల గమనాన్ని, గాలుల వేగాన్ని, వర్షపాత అంచనాలను నిరంతరం విశ్లేషిస్తూ ముందస్తు ప్రణాళికతో వ్యవహరించామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి యంత్రాంగానికి ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారాన్ని చేరవేశామని, అవేర్ వ్యవస్థ ద్వారా అందిన డేటాను విశ్లేషించి నిర్ణయాలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. గాలుల వేగం, వర్షపాతం, వరద నిర్వహణ, నీటి మళ్లింపు తదితర అంశాలపై చేసిన అంచనాలు క్షేత్రస్థాయి వాస్తవాలతో పోల్చినప్పుడు 90 శాతం వరకు సరైనవిగా తేలాయని పేర్కొన్నారు. ముంపు గ్రామాలు, తుఫాను ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన సహాయకసిబ్బంది, పరికరాలను అక్కడ మోహరించడంతో సహాయక చర్యలను వేగంగా చేపట్టగలిగామని సీఎం చంద్రబాబు తెలిపారు.

20 రోజులు పట్టే పనిని 4--5 రోజుల్లోనే పూర్తి చేశాం : తుఫాన్ల కారణంగా వివిధ జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టి కేవలం 4--5 రోజుల్లోనే సరఫరాను చాలావరకు పునరుద్ధరించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. సుమారు 31 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోగా, 4,095 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, 548 సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. ఇంత భారీగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పూర్తిస్థాయిలో గాడిలో పెట్టేందుకు సాధారణంగా కనీసం 20 రోజుల సమయం పట్టేదని, అయితే పక్కా ప్రణాళిక, సమన్వయం, సిబ్బంది అంకితభావంతో నాలుగైదు రోజుల్లోనే పునరుద్ధరణ సాధ్యమైందని సీఎం చంద్రబాబు వివరించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ నిరంతరం పనిచేశారని చెప్పారు. భారీ వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా చెట్లను తొలగిస్తూ, కూలిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారని, స్తంభాలు పాతేందుకు పెద్ద సంఖ్యలో డ్రిల్లింగ్ యంత్రాలను వినియోగించామని తెలిపారు. ఆక్వా చెరువుల్లోనూ విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, వేలాది చెట్లు నేలకొరిగినా సిబ్బంది వర్షంలోనే వాటిని తొలగించి పునరుద్ధరణ పనులు కొనసాగించారని పేర్కొన్నారు. విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేసి సరఫరాను త్వరగా పునరుద్ధరించారని ముఖ్యమంత్రి అభినందించారు.

5 వేల మంది గర్భిణుల తరలింపు... 1029 కాన్పులు : తుఫాన్ల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటంతో పాటు, వారికి అవసరమైన నిత్యావసర వస్తువులు, వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలకు చెందిన సుమారు 5 వేల మంది గర్భిణులను ముందుగానే గుర్తించి ఆస్పత్రులకు తరలించామని వెల్లడించారు. ఈ వారం రోజుల్లోనే 1,029 మంది గర్భిణులకు ప్రసవాలు జరిగాయని వివరించారు. గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్య భద్రతకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించామని చెప్పారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్సులు, అత్యవసర మందులు, పాము కాటు నివారణకు అవసరమైన యాంటీ స్నేక్ వెనమ్‌ను అందుబాటులో ఉంచామని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టామని, అంటువ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. 17 జిల్లాల్లోని 19,265 రేషన్ దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.

పొరుగు రాష్ట్రాలు, కేంద్రం సహకారం తీసుకున్నాం : విద్యుత్ పునరుద్ధరణతో పాటు ఇతర సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు పొరుగు రాష్ట్రాల సహకారం తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో ఒడిశాలో తుఫాను సహాయక చర్యల కోసం మన రాష్ట్రం నుంచి సిబ్బందిని పంపిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులతో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి అదనపు సిబ్బందిని పంపాలని కోరినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పరిస్థితిని కేంద్రానికి ఎప్పటికప్పుడు వివరించామని, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ మాట్లాడగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని సీఎం చంద్రబాబు తెలిపారు. కేంద్ర బృందాలు రాష్ట్రానికి వచ్చి నష్టాన్ని అంచనా వేశాయని, అర్నబ్ తుఫాను నష్టంపై రూ. 4,526 కోట్లతో మధ్యంతర నివేదికను కేంద్రానికి పంపినట్లు చెప్పారు. త్వరలో పూర్తిస్థాయి నివేదికను అందజేస్తామని వెల్లడించారు. అర్నబ్ తుఫాను కారణంగా 3.52 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. మురసు తుఫాను నష్టంపై కూడా ప్రాథమిక అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

11 టీఎంసీల నీరు రిజర్వాయర్లకు... 25 టీఎంసీలు చెరువుల్లోకి : ఒకవైపు తుఫాన్లు, మరోవైపు ఎల్‌నినో ప్రభావం రాష్ట్రాన్ని ఇబ్బంది పెడుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. తుఫాన్ల ద్వారా వచ్చిన నీటిని వృథా కాకుండా భద్రపరిచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. చెరువులకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, వచ్చిన నీటిని అవసరమైన ప్రాంతాలకు మళ్లించామని చెప్పారు. ఈ రెండు తుఫాన్ల ద్వారా వచ్చిన నీటిలో 11 టీఎంసీలను రిజర్వాయర్లకు మళ్లించగలిగామని, మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో మరో 25 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రెండుసార్లు తుఫాన్లు వచ్చినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 28 శాతం లోటు వర్షపాతం ఉందని, ముఖ్యంగా రాయలసీమలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయని తెలిపారు. తీరప్రాంతం తుఫాన్లతో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, రాయలసీమ కరవుతో సతమతం అవుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలంటే పోలవరం సహా ప్రాధాన్యమున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏవీఎస్ రెడ్డితో మాన్యువల్ రూపొందించామని, హుద్‌హుద్ తుఫాను సమయంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టక్కర్‌తో విపత్తు నిర్వహణ మాన్యువల్ తయారు చేయించామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. తుఫాన్లపై ఓ మాన్యువల్ ను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఇప్పుడు అర్నబ్ తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం పర్యటిస్తుండగా, ఎల్‌నినో పరిస్థితులను అంచనా వేసేందుకు మరో బృందం క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరుపుతోందన్నారు. ఈ బృందాలు పర్యటిస్తున్న సమయంలోనే మురసు తుఫాను ముప్పు రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందన్నారు. ఒక రాష్ట్రం ఒకేసారి ఇన్ని విపత్తులను ఎదుర్కోవడం ఇదే తొలిసారని, తాను కూడా ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

అధ్యయనం... ప్రత్యామ్నాయం... శాశ్వత పరిష్కారం : తుఫాన్ల సమయంలో ఎదురైన అనుభవాలను సమగ్రంగా విశ్లేషించి భవిష్యత్తులో నష్టాలను తగ్గించే శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈదురుగాలులను తట్టుకునేలా విద్యుత్ స్తంభాల నిర్మాణంలో మార్పులు చేయాలా? లేక ప్రత్యామ్నాయ సాంకేతిక పరిష్కారాలను అనుసరించాలా? అన్నది పరిశీలిస్తున్నామని చెప్పారు. తుఫాన్ల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల సాగు సీజన్‌లో మార్పులు చేయాలా? ప్రకృతి విపత్తులను తట్టుకోగలిగే ప్రత్యామ్నాయ వంగడాలను ప్రోత్సహించాలా? అన్న అంశాలను వ్యవసాయ నిపుణులతో చర్చిస్తామని తెలిపారు. ఈసారి రైతులందరికీ పంటల బీమా చేయించామని, బీమాతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందుబాటులోకి వస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. తుఫాన్లు సహా ఎలాంటి విపత్తులు వచ్చినా రైతులు నష్టపోకుండా ఉండేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ప్రజా పాలనకు పట్టణ ఓటర్ల ఆమోదం

- ఎన్డీఏ కూటమికి ప్రజల సంపూర్ణ మద్దతు
- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమికి ప్రజలు మరోసారి సంపూర్ణ మద్దతు, ఆశీర్వాదం అందించారని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజామోదంతో ఎన్డీఏ కూటమి విజయదుందుభి మోగించిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు తమ విశ్వాసాన్ని ఓట్ల రూపంలో చాటుకున్నారని తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు పట్టణ ప్రజలు మద్దతు పలికారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ ఎన్నికల ఫలితాలు ప్రజామోదంగా నిలిచాయని పేర్కొన్నారు.

బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య ఉన్న సమన్వయం, నాయకుల సమష్టి కృషి, క్షేత్రస్థాయిలో కార్యకర్తల అంకితభావం కూటమి విజయానికి బలమైన పునాదులుగా నిలిచాయని భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం మరింత బాధ్యతతో పనిచేస్తుందని స్పష్టం చేశారు.

ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి ఘన విజయాన్ని అందించిన ఓటర్లకు, ఎన్నికల ప్రచారంలో అహర్నిశలు శ్రమించిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కేంద్ర మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం ప్రజా పాలనకు లభించిన ఆమోదమని, రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానానికి మరింత స్ఫూర్తినిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఘన విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు

- ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి, నమ్మకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, మద్దతుతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

బీజేపీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు

- భారీ వర్షంలోనూ బాణసంచా కాలుస్తూ.. డప్పు వాయిద్యాలతో హోరెత్తించిన శ్రేణులు
- స్థానిక ఎన్నికల్లోనూ ఎన్డీఏకు ప్రజల సంపూర్ణ మద్దతు: బీజేపీ నేతలు





విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన విజయంతో బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విజయోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాలుస్తూ, డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్డీఏ కూటమికి ప్రజలు అందించిన చారిత్రాత్మక విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పునరావృతం చేశారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులకు ప్రజలు మరోసారి సంపూర్ణ మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లలో కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనా విధానం, కూటమి ప్రభుత్వ సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయడం, అమరావతి రాజధాని నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించడం, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి చర్యలు ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచాయన్నారు.

ఉత్తరాంధ్ర నుంచి నెల్లూరు వరకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చేలా నదుల అనుసంధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నానికి 25 టీఎంసీల నీటిని అందించే ప్రణాళికతో పాటు నాగావళి, వంశధార, మహేంద్ర తనయ, బహుదా నదుల అభివృద్ధి, అనుసంధానంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం కుడి కాలువ, నాగార్జునసాగర్, వెలుగోడు ప్రాజెక్టుల అనుసంధానం ద్వారా గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు నీటి వనరులను విస్తరించే అవకాశాలున్నాయని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి సుమారు రూ. 30 వేల కోట్ల మేర అదనపు నిధులు సమకూరే అవకాశాలున్నాయని పాకా వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు, ఇతర కేంద్ర ఆర్థిక కేటాయింపులు రాష్ట్ర అభివృద్ధికి మరింత దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

120 స్థానాల్లో బీజేపీ విజయం ఖరారు : బీజేపీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. కూటమి సీట్ల ఒప్పందంలో భాగంగా బీజేపీ సుమారు 260 స్థానాల్లో పోటీ చేసిందని, ఇప్పటివరకు సుమారు 120 స్థానాల్లో విజయం ఖరారైందని తెలిపారు. మిగిలిన స్థానాల్లో కౌంటింగ్ కొనసాగుతోందని, తుది ఫలితాల అనంతరం విజయాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజలకు ఉన్న విశ్వాసం, చంద్రబాబు నాయుడు అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమ ఆలోచనలు కూటమి విజయానికి ప్రధాన బలంగా నిలిచాయని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమన్వయంతో కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేశారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి విజయంతో రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని అన్నారు. పీవీఎన్ మాధవ్ సమన్వయంతో బీజేపీ శ్రేణులు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశాయని, కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి యామినీ శర్మ మాట్లాడుతూ.. ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కనుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత బలోపేతం చేశాయని పేర్కొన్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, అధికార ప్రతినిధి షేక్ బాజీ, బీజేవైఎం నాయకులు నాగిరెడ్డి, దాసం సాయి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో వైసీపీకి మరో షాక్ - రావులమ్మ నగర్ టీడీపీ కార్యాలయంలో జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసిపి యువనేత పల్లెబోయిన రాజేష్ ఆధ్వర్యంలో 50 మంది యువత చేరిక



కాకినాడ జిల్లా జగ్గంపేట నవంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) : జగ్గంపేట నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో యువత పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతోంది. స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పల్లెబోయిన రాజేష్ ఆధ్వర్యంలో రాజేష్ యువసేనకు చెందిన సుమారు 50 మంది సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లెబోయిన రాజేష్ మాట్లాడుతూ - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ యువతను ప్రోత్సహిస్తున్న తీరుకు ఆకర్షితులై తాము టీడీపీలో చేరుతున్నామని అన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ నాయకత్వాన్ని బలపరుస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, టిడిపి జడ్పిటిసి అభ్యర్థి జీను మణి బాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, వైభోగుల కొండబాబు యాదవ్, మోరు రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం.. కాంగ్రెస్ నేతల ధీమా



కాకినాడ జిల్లా, జగ్గంపేట నవంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు, రైతులకు, పేదలకు న్యాయం జరుగుతుందని జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మరోతి శివ గణేష్ అన్నారు. సోమవరం కాకినాడ జిల్లా జగ్గంపేట లో సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున చంద్రమౌళి వెంకటరత్నం పోటీకి సిద్ధమవుతున్నారని తెలిపారు. నాలుగు మండలాల పరిధిలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతోందని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం. పల్లంరాజు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందని నాయకులు తెలిపారు. ఇటీవల తుఫాన్ల కారణంగా నష్టపోయిన రైతులకు, బాధితులకు నష్టపరిహారం త్వరగా అందించాలని వారు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు, రైతులకు న్యాయం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందన్నారు. బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతోందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన ఉపాధి హామీ వంటి పథకాలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తుచేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు గుప్పించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పోలవరం ప్రాజెక్టు అభివృద్ధికి ప్రాధాన్యత లభించిందని, అనంతరం ప్రాజెక్టు పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని ఆరోపించారు. జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాల కోసం కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ప్రజా ప్రభుత్వానికి బాటలు వేయాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలి

- ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహనా పెంచాలి

- నవంబర్ 1వ తేదీన ఏలూరులో జరిగిన కార్పోరేషన్ ఎన్నికలకు సహకరించిన ఏలూరు ప్రజానీకానికి ధన్యవాదాలు

- యువత భవిష్యత్తుకు రాష్ట్ర వికాసానికి ఓటు బలమైన పునాది

- తక్కువ పోలింగ్ పై ఆందోళన

ఏలూరులో దాదాపు 60 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి

- సహకరించిన కూటమి నేతలకు, మీడియా మిత్రులకు, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు

- మీడియా సమావేశంలో ఏలూరు నగర మేయర్ అభ్యర్థి, జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు



ఏలూరు, నవంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) : ఏలూరు నగర పాలక సంస్థ ఎన్నికల్లో బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకున్న ఏలూరు నగర ప్రజలందరికీ, ఏలూరు సమగ్రాభివృద్ధి కోసం జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల కూటమికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎన్డీఏ బలపరిచిన ఏలూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ ఏలూరులో ఎన్డీఏ కూటమికి భారీ మెజారిటీని ఇవ్వనున్న ఏలూరు నగర ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. ఏలూరు ప్రజల ఆకాంక్షలే తన ఆశయమని, ఏలూరు అభివృద్ధే తన లక్ష్యం అని అన్నారు. ఏలూరులో యువతకు మెరుగైన అవకాశాలు, ప్రతి కుటుంబానికి ప్రశాంతమైన జీవనం, సురక్షితమైన నగరం, సమర్థవంతమైన పాలన అందించడమే తన సంకల్పం అన్నారు. నవంబర్ 1వ తేదీన ఏలూరులో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరఫున ఏలూరు నగర మేయర్ అభ్యర్థిగా నన్ను ఆదరించి, అభిమానించి, ఆశీర్వదించి నాకు తమ అమూల్యమైన ఓటు వేసిన, ఏలూరు నగర ప్రజలకు కూటమి తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.. ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి కి, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్ కి, అలాగే బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు తపన చౌదరి కి, బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ కి, జనసేన పార్టీ అధిష్టానం నుంచి పరిశీలకులుగా వచ్చిన ఉంగుటూరు శాసనసభ్యులు పట్సమట్ల ధర్మరాజు కి, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) కి, నా వెన్నంటే ఉండి అన్ని విధాలుగా సహకరించిన ఏలూరు జనసేన పార్టీ ఎన్నికల సమన్వయకర్త, మిత్రులు, జనసేన నాయకులు నారా శేషు కి, శిరిపల్లి ప్రసాద్ కి, రాఘవయ్య చౌదరి తో పాటు ఏలూరు నగర కమిటీకి చెందిన కార్యవర్గానికి రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరులో ఎన్డీఏ కూటమి విజయానికి సహకరించి, కష్టపడిన పనిచేసిన, కూటమి పార్టీలకు చెందిన నాయకులకు, కార్యకర్తలకు, వీరమహిళలకు, మెగా అభిమాలకు, పలు కుల సంఘాల వారికి ధన్యవాదాలు తెలిపారు.. ఏలూరులో, నన్ను నమ్మి నాకు ఈ సీటును కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, విద్యాశాఖ మంత్రి నారా నారా లోకేష్ కి, జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్ర రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ కి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యేకంగా ఆయన ప్రత్యేకంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు నగరంలో దాదాపు 60 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2,37,256 ఓట్లకు గాను 1,41,506 ఓట్లు పోలయ్యాయి. అంటే దాదాపుగా 60 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. పేద, ధనిక, మధ్య తరగతి వర్గాల వారు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించు కుంటేనే, తమ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందించినట్లుగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ 100 శాతం తమ ఓటు హక్కును వినియోగించుకుంటేనే తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉంటుందని, సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి మనకు రాజ్యాంగం కల్పించిన ఈ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. తక్కువ పోలింగ్ పై ఆందోళన వ్యక్త పరిచారు. ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహనా కల్పించాలని అన్నారు. అలాగే ఏలూరులో చాలా ప్రశాంతమైన వాతావరణంలో, ఎటువంటి అల్లర్లకు తావులేకుండా ఈ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలు జరిగాయి. ఇంతా చక్కగా జరగడానికి సహకరించిన పోలీస్ డిపార్ట్మెంట్ వారికి, ఎస్పీ కి, జిల్లా కలెక్టర్ కి, ఇతర జిల్లా యంత్రాంగానికి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు, ఏలూరు ప్రజానీకానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో జరుగనున్న లెక్కింపులపై పోలింగ్ బూత్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేశారు. మీడియా సమావేశంలో జనసేన పార్టీ ఏలూరు ఎన్నికల సమన్వయకర్త నారా శేషు, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, నగర అధ్యక్షులు వీరంకి పండు, గౌరవ అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, బోండా రాము నాయుడు, బొత్స మధు, ఎట్రించి ధర్మేంద్ర, తీడ సత్యనారాయణ, అల్లు సాయి చరణ్, బెజవాడ నాగభూషణం కుమార్, జనసేన రవి, పోలింగ్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర అండర్-23 జట్టుకు అనంతపురం క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి ఎంపిక

1675 పరుగులు, 2 సెంచరీలు, 14 అర్ధ సెంచరీలు, 114 సిక్సర్లతో సత్తా



అమరావతి, నవంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) : అనంతపురం జిల్లాకు చెందిన యువ రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి మరోసారి తన సత్తా చాటుకున్నారు. అద్భుతమైన బ్యాటింగ్, వికెట్ కీపింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆయనను ఆంధ్ర అండర్-23 రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 ఇంటర్‌జోనల్, అంతర్‌జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచిన దత్త రెడ్డి ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు.

ఒకే సీజన్‌లో 1675 పరుగులు

ఈ క్రికెట్ సీజన్‌లో మచ్చా దత్త రెడ్డి బ్యాటింగ్‌లో అసాధారణ ప్రదర్శన కనబరిచారు. మొత్తం 1675 పరుగులు సాధించి, 2 సెంచరీలు, 14 అర్ధ సెంచరీలు నమోదు చేశారు. సీనియర్ ఆంధ్ర ఇంటర్‌జోనల్ పోటీల్లో సెంచరీతో పాటు 161 పరుగులు సాధించి తన బ్యాటింగ్ సామర్థ్యాన్ని చాటుకున్నారు.అదేవిధంగా ఈ సీజన్‌లో 114 సిక్సర్లు బాదిన దత్త రెడ్డి ఆంధ్ర క్రికెట్‌లో అరుదైన రికార్డు నమోదు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్‌లోనూ స్థిరమైన ప్రదర్శన చేస్తూ ఆంధ్ర వికెట్ కీపర్లలో తన స్థానాన్ని బలపరుచుకున్నారు.

- అండర్-12 నుంచి అండర్-23 వరకు ఆంధ్రకు ప్రాతినిధ్యం

మచ్చా దత్త రెడ్డి ఇప్పటికే అండర్-12, అండర్-16, అండర్-19, అండర్-23 విభాగాల్లో ఆంధ్ర రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసి ఐ) ఆధ్వర్యంలోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్ సి ఏ) శిక్షణకు కూడా ఎంపికయ్యారు.ఆంధ్ర రాష్ట్ర జట్టుకు అనేక సంవత్సరాలుగా ప్రాతినిధ్యం వహిస్తూ కీలక సందర్భాల్లో తన బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో భాగస్వామిగా నిలిచారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపిఎల్) లో తుంగభద్ర వారియర్స్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు.

- అనంతపురంలో ఆంధ్ర--అస్సాం పోరు

ఆంధ్ర అండర్-23 జట్టు తదుపరి పోరులో అస్సాం జట్టుతో తలపడనుంది. నవంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు అనంతపురంలోని ఆర్ డిటి మైదానంలో నాలుగు రోజుల మ్యాచ్ జరగనుంది. స్వస్థలంలోనే ఆంధ్ర అండర్-23 జట్టుకు మచ్చా దత్త రెడ్డి ప్రాతినిధ్యం వహించనుండటంతో స్థానిక క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

- అభినందనలు

మచ్చా దత్త రెడ్డి ఆంధ్ర అండర్-23 రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం పట్ల ఆర్ డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనాథ్, కార్యదర్శి శ్రీధర్, సీనియర్ క్రికెటర్లు, అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ఆంధ్ర క్రికెట్‌కు, అనంతపురం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

స్థానిక ఎన్నికల సందర్భంగా ప్రత్యేక చెక్ పోస్ట్



చింతూరు, నవంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక జెడ్ పి టి సి, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా పోలీస్‌అవుట్ పోస్ట్ ను ఏర్పాటు చేసారు. పోలీస్ ఉన్నతాధికారులైన జిల్లా ఎస్పీ చక్రవర్తి, ఏ ఎస్ పి ఉదయపావని ఆదేశాల మేరకు చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్ ఎర్రం పేట గ్రామంలోని 328 జాతీయ రహదారి మూల మలుపు వద్ద చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మద్యం, ప్రత్యేక బహుమతులు,చీరలు, పైకం(క్యాష్) ఇతరత్రా బహుమతులు ఓటర్లకు పంపిణీ చేయకుండా నిరోధించటానికి ఈ చెక్ పోస్ట్ ను ప్రారంభించినట్లు సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేస్తే కేసులు పెడుతున్నామని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కచ్చితంగా ఉండాలని, లేనిచో వాహనాన్ని సీజ్ చేస్తామని, కేసులు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి ఐ, యస్ ఐతో పాటు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరువు నష్టాలపై అనంతపురం జిల్లాలో ఇంటర్ మినిస్టీరియల్ కేంద్ర కరువు బృందం పర్యటన

కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలన..

ఉన్నతాధికారులతో కేంద్ర బృందం సమగ్ర సమీక్ష..

రూ. 1,420 కోట్ల ప్రతిపాదనల వివరాలను నివేదించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జీలానీ సమూన్.

అనంతపురం జిల్లాకు 6 విభాగాల కింద రూ. 380 కోట్ల కేంద్ర సాయం కావాలని నివేదించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తాం: కేంద్ర బృందం లీడర్ చిన్మయ్ గోట్మారే.



అనంతపురం నవంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) : సూపర్ ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ 2026 సీజన్‌లో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు, పంట నష్టాలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసేందుకు ఇంటర్ మినిస్టీరియల్ కేంద్ర కరువు బృందం (సోమవారం అనంతపురం జిల్లాలో పర్యటించింది. కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని ఇంటర్ మినిస్టీరియల్ కేంద్ర కరువు బృందం సభ్యులు ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను, ఎండిపోయిన పంటల దృశ్యాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేంద్ర బృందం ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర బృందం లీడర్ చిన్మయ్ గోట్మారేతో పాటు రాష్ట్ర నోడల్ అధికారి వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జీలానీ సమూన్, గో ఐ,డాడ్ డాక్టర్ కె.పొన్నుస్వామి, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, కేంద్ర బృందం సభ్యులైన మహాలనోబిస్ జాతీయ పంట అంచనా కేంద్రం సహాయ సంచాలకులు ప్రభా కాంతి, గ్రామీణ శాఖ అండర్ సెక్రటరీ వినోద్ సమంత్, వ్యయ విభాగం డిప్యూటీ డైరెక్టర్ పంకజ్ పహాడియా, ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణ ఁ మూల్యాంకన డైరెక్టరేట్ డైరెక్టర్ ఎన్.వి.సతీష్ సీమకుర్తి, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఉద్యాన శాఖ డిడి ఉమాదేవి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ చంద్, డ్వామా పీడీ శైలజ, సీపీఓ బాలాజీ నాయక్ తదితర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర బృందం జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారని, ముసాయిదా వినతిపత్రం (డ్రాఫ్ట్ మెమోరాండం) తమకు ఇప్పటికే అందిందని తెలిపారు. కేంద్ర సహాయం కింద రాష్ట్రానికి అవసరమైన నిధుల వివరాలను డైరెక్టర్ వ్యవసాయ శాఖ వారు స్పష్టంగా వివరించారని, తాము స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తున్నామని చెప్పారు. క్షేత్ర పర్యటన ముగిసిన అనంతరం ఈ నెల 4వ తేదీన విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో తదుపరి చర్చలు జరుగుతాయని పేర్కొంటూ, కరవు తీవ్రతను సమగ్రంగా వివరించిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలిపారు.అంతకుముందు రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు మనజీర్ జీలానీ సమూన్ ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితులపై కేంద్ర బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నుంచే అత్యంత చురుగ్గా కరవు నివారణ చర్యలు చేపట్టిందని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి ప్రతి 15 రోజులకు ఒకసారి కరవుపై సమీక్షలు నిర్వహిస్తున్నారని, భారత ప్రభుత్వానికి దాదాపు రూ. 1,420 కోట్ల కేంద్ర సాయం కోరుతూ సమగ్ర వినతిపత్రం సమర్పించామని, ఇందులో అత్యధిక భాగం వ్యవసాయ రంగానికే ప్రతిపాదించామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నాటికి రాష్ట్ర సగటు వర్షపాతం లోటు మైనస్ 52 శాతంగా నమోదైందని, ఇది దేశ సగటు లోటు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువని వివరించారు. ప్రకాశం (-70%), అన్నమయ్య (-76%) జిల్లాల్లో లోటు మరింత అధికంగా ఉందని, గ్రామ స్థాయిలో అన్ని శాఖల అధికారులు, నీటి వినియోగదారుల సంఘాలు, రైతు సంఘాలతో ఎల్ నినో నివారణ కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ అమలు చేస్తున్నామని, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీని 21 వేల క్వింటాళ్ల నుంచి దాదాపు 2 లక్షల క్వింటాళ్లకు పెంచామని, ప్రత్యేక కంట్రోల్ రూమ్, కమాండ్ ఁ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. మనుషుల తాగునీటికి మొదటి ప్రాధాన్యం, పశువుల తాగునీటికి రెండో ప్రాధాన్యం, వ్యవసాయం మరియు ఉద్యాన పంటల రక్షణకు మూడో ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. శాటిలైట్ చిత్రాలు, ఎన్‌డీవీఐ సూచీల ద్వారా పంటల ఒత్తిడిని ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో మ్యాపింగ్ చేశామని, కేంద్ర నిబంధనల ప్రకారం రాష్ట్రంలో 410 మండలాలకు ప్రతిపాదనలు రాగా 388 మండలాలను కరవు మండలాలుగా (283 తీవ్ర, 105 మోస్తరు) ప్రకటించామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 11.2 లక్షల హెక్టార్లలో సుమారు 14 లక్షల మంది రైతులు నష్టపోయారని, విపత్తు ప్రతిస్పందన నిధుల నిబంధనల ప్రకారం వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటలకు దాదాపు రూ. 46 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ. 110 కోట్లు, తాగునీటి సరఫరా నిధులను మంజూరు చేసి రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి నివేదించారు. అనంతపురం జిల్లాలోని 32 మండలాలకు గాను 30 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించారని, అక్టోబర్ 31 నాటికి సంచిత వర్షపాతం లోటు సుమారు మైనస్ 42 శాతంగా నమోదైందని తెలిపారు. దాదాపు 2.29 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయని, సుమారు 38,000 మెట్రిక్ టన్నుల మేత కొరత ఉందని చెప్పారు. జిల్లా తరఫున 6 ప్రధాన విభాగాల కింద దాదాపు రూ. 380 కోట్ల కేంద్ర సాయాన్ని కోరుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇందులో వ్యవసాయ దిగుబడి నష్టం, వేరుశనగ, ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి సుమారు రూ. 280 కోట్లు, ఉపాధి హామీ కింద ఇప్పటికే 125 పనిదినాలు పూర్తి చేసుకున్న 39,000 మంది కూలీలకు అదనపు పనిదినాలు కల్పించేందుకు రూ. 61 కోట్లు, పశు గ్రాసం అనుబంధ అవసరాలకు రూ. 24 కోట్లు, తాగునీటి ఎద్దడి నివారణకు రూ. 15 కోట్లు, 5 మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరా పెంపునకు రూ. 1.75 కోట్లు ప్రతిపాదించినట్లు నివేదించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, వ్యవసాయ, ఉద్యాన శాఖ, పశు సంవర్ధక శాఖ అధికారులు పలు కీలక అంశాలను కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలో బోరుబావులు అధికంగా ఉండటం వల్ల భూగర్భ జలాల తోడివేతను నియంత్రించడం కష్టంగా మారిందని, హెచ్ఎల్‌సి మరియు హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని రిజర్వాయర్లు నింపడానికే తొలి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. కర్ణాటక సరిహద్దు వైపున ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పంటలనే అనుమతించారని, వరి సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించామన్నారు. గత రెండేళ్లలో 41 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం అమలు చేసి జిల్లా దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని వివరించారు. బత్తాయి, మామిడి, దానిమ్మ వంటి దీర్ఘకాలిక ఉద్యాన తోటలు ఎండిపోతుండటంపై చర్చించగా, ఎండిన తోటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంతో పాటు ఏరియా ఎక్స్‌పాన్షన్ కింద ఆదుకోవాలని అధికారులు కోరారు. సమీపంలోని చెరువులు ఎండిపోవడంతో రైతులు సొంతంగా 15--20 కిలోమీటర్ల దూరం నుంచి ట్యాంకర్ల ద్వారా తోటలకు నీటిని తరలించుకుంటున్నారని తెలిపారు. రాయితీపై నేపియర్ గ్రాస్ పంపిణీ, పీఎండీఎస్ విధానంలో బహుళ విత్తనాల మొలకల ద్వారా పశుగ్రాసం సమకూరుస్తున్నట్లు వివరించారు. వర్షాభావం వల్ల జూలై మధ్యలో అరకొర వర్షాలతో సాధారణ విస్తీర్ణంలో 60 శాతం మాత్రమే విత్తనాలు పడ్డాయని, మిగిలిన 40 శాతం విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ ఆరుతడి విత్తనాలు పంపిణీ చేశామని, పంటల మార్పిడి వల్ల ఎదురయ్యే బీమా క్లెయిమ్‌ల విషయంలో రైతులకు నష్టం కలగకుండా తగిన తోడ్పాటు అందించాలని జిల్లా యంత్రాంగం కేంద్ర బృందాన్ని కోరింది.సమీక్ష అనంతరం కేంద్ర కరువు బృందం పలు వివరాలు అడిగి తెలుసుకుని క్షేత్రస్థాయి పర్యటనకు బయలుదేరి వెళ్లింది.



మైదుకూరు మున్సిపాలిటీలో టీడీపీ హవా!

- 15 వార్డుల కౌంటింగ్‌లో 13 వార్డుల్లో టీడీపీ అభ్యర్థుల విజయం

కడప జిల్లా మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు జరిగిన ఓట్ల లెక్కింపులో వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం 13 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు, ఒక వార్డులో బీజేపీ అభ్యర్థి, మరో వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.

వార్డుల వారీగా విజేతలు, మెజారిటీ వివరాలు

1. 3వ వార్డు: పి. సౌభాగ్యమ్మ – టీడీపీ – 651 ఓట్ల మెజారిటీ. 2. 4వ వార్డు: మూలే లక్ష్మి – టీడీపీ – 621 ఓట్ల మెజారిటీ. 3. 6వ వార్డు: యు. భారతి – టీడీపీ – 664 ఓట్ల మెజారిటీ. 4. 7వ వార్డు: షేక్ అల్తాఫ్ హుస్సేన్ – టీడీపీ – 659 ఓట్ల మెజారిటీ. 5. 9వ వార్డు: షేక్ ఫర్జానా – టీడీపీ – 526 ఓట్ల మెజారిటీ. 6. 10వ వార్డు: జి. పార్వతి – టీడీపీ – 819 ఓట్ల మెజారిటీ. 7. 11వ వార్డు: టి. అంజనమ్మ – టీడీపీ – 737 ఓట్ల మెజారిటీ. 8. 12వ వార్డు: కే. సుబ్బారావు – టీడీపీ – 518 ఓట్ల మెజారిటీ. 9. 14వ వార్డు: డి. వరకుమార్ – టీడీపీ – 596 ఓట్ల మెజారిటీ. 10. 16వ వార్డు: షేక్ అక్బర్ – టీడీపీ – 737 ఓట్ల మెజారిటీ. 11. 21వ వార్డు: ఎం. శ్రీదేవి – బీజేపీ – 234 ఓట్ల మెజారిటీ. 12. 23వ వార్డు: బీఎన్. పార్వతి – స్వతంత్ర అభ్యర్థి – 353 ఓట్ల మెజారిటీ. 13. 27వ వార్డు: బి. బేబీ – టీడీపీ – 595 ఓట్ల మెజారిటీ. 14. 28వ వార్డు: పి. లక్ష్మీదేవి – టీడీపీ – 542 ఓట్ల మెజారిటీ. 15. 32వ వార్డు: విజయ్ – టీడీపీ – 737 ఓట్ల మెజారిటీ. మొత్తం ఫలితాల వివరాలు:టీడీపీ – 13 వార్డులు, బీజేపీ – 1 వార్డు, స్వతంత్ర అభ్యర్థి –1 వార్డు.

మైదుకూరు మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో వెలువడిన ఈ వివరాలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మున్సిపల్ ఫలితాల స్ఫూర్తితో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ పోరులోనూ ఆశీర్వదించండి

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- ఉండ్రాజవరం మండలంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి మంత్రి దుర్గేష్ భారీ రోడ్ షో
- గత రెండన్నరేళ్లలోనే ఉండ్రాజవరం మండల అభివృద్ధికి రూ. 68.09 కోట్లు వ్యయం చేశామని వెల్లడి..కూటమి జెడ్పీటీసీ అభ్యర్థి, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి
- స్థానిక సంస్థల్లోనూ గెలిపిస్తే 'ట్రిపుల్ ఇంజిన్' సర్కార్‌తో గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని స్పష్టం




నిడదవోలు,నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): ఇటీవల ముగిసిన నిడదవోలు మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 32 వార్డులకు గానూ 28 వార్డుల్లో కూటమి కూటమి అభ్యర్థులను ఘనవిజయంతో ఆశీర్వదించిన ప్రజలందరికీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విజయపరంపరను నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ మరియు రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించి, గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

మంగళవారం నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలంలోని పలు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి మంత్రి దుర్గేష్‌వర్షంలో సైతం భారీ రోడ్ షో నిర్వహించారు. ఉండ్రాజవరం, సూర్యారావుపాలెం, పసలపూడి, సత్యవాడ, వడ్లూరు, చివటం, సావరం, పాలంగి,తాడిపర్రు, వెలగదుర్రు, మోర్త, దమ్మెన్ను, వేలివెన్ను తదితర ప్రాంతాల్లో సాగిన ఈ ప్రచారంలో కూటమి జెడ్పీటీసీ అభ్యర్థి వేముల వెంకట మంజూల (జనసేన)తో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..."గత వైకాపా ప్రభుత్వం చేయలేని పనులను కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన రెండన్నరేళ్ల స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపించింది. ఒక్క ఉండ్రాజవరం మండలంలోనే రూ. 69 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను నిర్మించాం. ఒక్క సూర్యారావుపాలెంలోనే రూ. 2.50 కోట్లతో పనులు చేపట్టాం. అదే విధంగా ఉండ్రాజవరంలో రూ. 15.40 కోట్లు, పసలపూడి లో రూ. 1.59 కోట్లు, సత్యవాడ లో రూ. 2.83 కోట్లు, వడ్లూరు లో రూ. 2.24 కోట్లు, చివటం లో రూ. 6.82 కోట్లు, సావరంలో రూ. 4.05 కోట్లు, పాలంగి లో రూ. 6.50 కోట్లు,తాడిపర్రు లో రూ. 3.89 కోట్లు, వెలగదుర్రు లో రూ. 1.24 కోట్లు, మోర్తలో రూ. 4.90 కోట్లు, దమ్మెన్ను లో రూ. 1.29 కోట్లు, వేలివెన్ను లో రూ. 8.80 కోట్లు గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ నిధులను పక్కదారి పట్టించి నిర్లక్ష్యం చేసింది. జల్ జీవన్ మిషన్ ద్వారా గోదావరి జలాలను శుద్ధి చేసి ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే.కూటమి ప్రభుత్వం రోడ్లను అద్భుతంగా నిర్మిస్తే.. గత ప్రభుత్వ పాలనలో కనీసం రోడ్లపై తట్టెడు మట్టి కూడా వేయలేదు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కూటమికి స్థానిక సంస్థల బాధ్యతలు కూడా అప్పగిస్తే, 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'గా అభివృద్ధి, సంక్షేమాలు మరింత వేగంగా ముందుకు సాగుతాయి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'పల్లె పండుగ 1.0', 'పల్లె పండుగ 2.0', మరియు 'శాస్కీ' పథకాల ద్వారా గ్రామీణ రోడ్ల రూపురేఖలను మార్చివేశాం.అన్ని నియోజకవర్గాలకు రూ. 7 కోట్లు ఇస్తే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో మాట్లాడి నిడదవోలు నియోజకవర్గానికి రూ. 28 కోట్ల శాస్కి నిధులు తీసుకొచ్చాను. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంయుక్తంగా అందిస్తున్న సూపర్ సిక్స్ హామీల లబ్ధిని ప్రతి పేదవాడికి అందిస్తున్నాం.త్వరలోనే నూతన పింఛన్లు అందించి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం" అన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన ప్రజల ఉత్సాహం కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనమని, వైసీపీలా మాటల ప్రభుత్వం కాకుండా చేతల ప్రభుత్వంగా ప్రజా సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉంటామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

మురసు తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో భారీ వర్షాలు



గుంటూరు,నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): మురసు తుపాను ప్రభావంతో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మంగళవారం కురిసిన కుండపోత వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చిలకలూరిపేట పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. గత అనుభవాల నేపథ్యంలో, బుడమేరు వాగుకు మళ్లీ వరద పోటెత్తుతుందేమోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం సహాయక చర్యలపై దృష్టి సారించింది.

జగన్ విధ్వంసానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు: పెమ్మసాని

- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఘన విజయం
- కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారన్న పెమ్మసాని
- వైసీపీ హయాంలోని అరాచకాలకు, నేటి ప్రజాస్వామ్య ఎన్నికలకు తేడా ఇదేనని వ్యాఖ్య
- ఈవీఎంలపై వైసీపీది తప్పుడు ప్రచారం అని, బ్యాలెట్‌తోనూ ప్రజలు తిరస్కరించారని వెల్లడి
- రెండున్నరేళ్లలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళుతోందని స్పష్టీకరణ



అమరావతి, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చారిత్రాత్మక విజయం సాధించడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర, అరాచక పాలనను ప్రజలు తమ ఓటుతో నిర్ద్వంద్వంగా తిరస్కరించారని, కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గెలుపు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ల సమష్టి నాయకత్వంపై ప్రజలు ఉంచిన అచంచల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొచ్చిందని పెమ్మసాని వివరించారు. పేదలకు ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు, దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులు, వికలాంగులకు అందిస్తున్న రూ. 4,000, రూ. 6,000 పెన్షన్లు, 'తల్లికి వందనం', 'దీపం', 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాల ద్వారా సుమారు రూ. 1,50,000 కోట్ల సంక్షేమాన్ని నేరుగా ప్రజలకే అందించామని తెలిపారు.

ఒకవైపు సంక్షేమం, మరోవైపు అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ, 'రాయలసీమ రైజింగ్' వంటి కార్యక్రమాలతో యువతకు, వెనుకబడిన ప్రాంతాలకు భరోసా ఇస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్నాయని కొనియాడారు.

అరాచక పాలనకు, ప్రజాస్వామ్య పాలనకు తేడా ఇదే

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికలకు, నేటి కూటమి పాలనలో జరిగిన ఎన్నికలకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని పెమ్మసాని ఎద్దేవా చేశారు. 2019 తర్వాత జగన్ ప్రభుత్వం ప్రత్యర్థులపై గంజాయి, హత్యాయత్నం కేసులు పెడతామని బెదిరించి, పెన్షన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేస్తామని ఒత్తిడి చేసి నామినేషన్లు వేయనీయకుండా చేసిందని ఆరోపించారు.

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ వార్డులు కలిపి 1,44,000 స్థానాలకు గాను 50,000 స్థానాలను, అంటే 35 శాతం సీట్లను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వంలో శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు అత్యంత శాంతియుతంగా ఎన్నికలు జరిగాయని, ప్రజలు స్వేచ్ఛగా ఓటేశారని అన్నారు. ఫలితాలు వెల్లడైన 92 మున్సిపాలిటీల్లో 88 చోట్ల, అంటే 90 శాతానికి పైగా స్థానాల్లో ప్రజలు కూటమికి పట్టం కట్టారని వెల్లడించారు.

ఈవీఎంలపై నెపం కాదు.. ప్రజల తిరస్కరణే కారణం

ఓడిపోతే ఈవీఎంలపై నెపం వేయడం వైసీపీకి అలవాటైందని పెమ్మసాని మండిపడ్డారు. 2023లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, 2024 తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు, నేటి స్థానిక సంస్థల ఎన్నికలు అన్నీ బ్యాలెట్ పేపర్లతోనే జరిగాయని, అన్నింటిలోనూ వైసీపీని ప్రజలు చావుదెబ్బ కొట్టారని గుర్తుచేశారు. వైసీపీ మార్చాల్సింది మిషన్లను కాదని, ప్రజల్లో వారిపై ఉన్న వ్యతిరేకతను గుర్తించాలని హితవు పలికారు. ఎంతటి భావోద్వేగాలు ఉన్నా సంయమనం పాటించాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారని, ఆయన నాయకత్వ పటిమ వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు.గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడంతో నిలిచిపోయిన 92 కేంద్ర ప్రభుత్వ పథకాలను తిరిగి పట్టాలెక్కించామని పెమ్మసాని తెలిపారు. కేంద్ర సహకారంతో 3 లక్షల గ్రామీణ ఇళ్లు, 'జల్ జీవన్ మిషన్' ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి, గుంతలు పడ్డ రోడ్ల మరమ్మతులు, పోలవరం సహా 36 ప్రాజెక్టులకు రూ. 35,000 కోట్లతో పనులు వేగవంతం చేశామన్నారు. జగన్ ప్రభుత్వం 9 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచితే, తాము 'ట్రూ–డౌన్' విధానంలో ప్రజలపై భారం పడకుండా చూస్తున్నామన్నారు. రాబోయే రెండున్నరేళ్లలో మరింత కసితో పనిచేసి ఏపీని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలుపుతామని పెమ్మసాని చంద్రశేఖర్ ధీమా వ్యక్తం చేశారు.

జడ్పీటీసీ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులకు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దిశానిర్దేశం




- ఎన్నికల ప్రచారం, పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలకు సూచనలు

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండలంలో నవంబర్ 5వ తేదీన జరగనున్న జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయడం, పార్టీ బలోపేతం, ఓటర్లను నేరుగా కలిసి పార్టీ విధానాలను వివరించడం వంటి అంశాలపై నాయకులకు పలు సూచనలు చేశారు.

సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మేకల రత్న కుమార్ యాదవ్, సన్‌రైజ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, విశ్వబ్రాహ్మణ మాజీ డైరెక్టర్ గొడ్లవీటి సుబ్రమణ్యం ఆచారి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, సోమయ్య జడ్పీటీసీ అభ్యర్థి జోగయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అన్ని అపోహలు పటాపంచలు.. సౌర తుపానుల గుట్టు విప్పిన ఆదిత్య-ఎల్1

- భారత సౌర పరిశోధక ఉపగ్రహం ఆదిత్య-ఎల్1 కీలక ఆవిష్కరణ
- సౌర జ్వాలలు (సీఎంఈలు) ఒకేలా విస్తరించవని తొలిసారి గుర్తింపు
- ఈ ఆవిష్కరణతో అంతరిక్ష వాతావరణాన్ని మరింత కచ్చితంగా అంచనా వేసే అవకాశం
- ఉపగ్రహాలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ల భద్రతకు ఈ అధ్యయనం ఎంతో కీలకం
- భారతీయ ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థ పరిశోధకుల ఘనత



అమరావతి, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): భారత తొలి అంతరిక్ష ఆధారిత సౌర పరిశోధన కేంద్రం ఆదిత్య–ఎల్1 మరో చరిత్రాత్మక విజయాన్ని సాధించింది. సూర్యుడి నుంచి వెలువడే అత్యంత శక్తివంతమైన కరోనల్ మాస్ ఎజెక్షన్ల (సీఎంఈ)పై సరికొత్త వివరాలను వెలుగులోకి తెచ్చింది. అంతరిక్ష వాతావరణ అధ్యయనంలో ఈ పరిశోధన ఒక కీలక ముందడుగు అని, దీనివల్ల భూమిపై ఉపగ్రహాలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లకు సౌర తుపానుల నుంచి ఎదురయ్యే ముప్పును మరింత కచ్చితంగా అంచనా వేయవచ్చని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఇప్పటివరకు సౌర జ్వాలలు అన్ని వైపులా ఒకే రీతిలో, సమానంగా విస్తరిస్తాయని శాస్త్రవేత్తలు భావించేవారు. అయితే, ఆదిత్య–ఎల్1 అందించిన డేటా ఈ అంచనాను తప్పని నిరూపించింది. ఈ భారీ సౌర విస్ఫోటనాలు అసమానంగా విస్తరిస్తాయని తొలిసారిగా రుజువైంది. సీఎంఈల విస్తరణలోని ఈ తేడాలు, అవి భూమి వైపు ప్రయాణించే వేగాన్ని నేరుగా ప్రభావితం చేస్తాయని, అంతరిక్ష వాతావరణంలో అలజడులకు కారణమవుతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు.

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని పూర్తి చేశారు. ఇందుకోసం ఆదిత్య–ఎల్1లోని ప్రధాన పేలోడ్ అయిన విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ నుంచి వచ్చిన డేటాను, నాసాకు చెందిన సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ సమాచారంతో అనుసంధానించారు. అనంతరం 3డీ మోడలింగ్ ద్వారా సీఎంఈ పూర్తి స్వరూపాన్ని, దాని కదలికలను పునర్నిర్మించారు. "సీఎంఈ అసమాన ఆకృతి, సౌరగాలులతో దాని పరస్పర చర్యను ప్రభావితం చేస్తుంది. ఇది దాని వేగాన్ని, చివరకు భూమిని చేరుకునే సమయాన్ని నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని ఈ అధ్యయన బృందంలోని శాస్త్రవేత్త జయంత్ జోషి తెలిపారు. ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత 'ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి.

2023 సెప్టెంబర్‌లో ప్రయోగించిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహం, ప్రస్తుతం భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాగ్రాంజ్ పాయింట్ 1 (లా1) వద్ద స్థిరంగా ఉండి సూర్యుడిపై నిరంతర నిఘా కొనసాగిస్తోంది. భవిష్యత్తులో ఇతర సీఎంఈలపైనా ఇదే సాంకేతికతను ఉపయోగించి వాటి గమనాన్ని మరింత కచ్చితంగా అంచనా వేయాలని పరిశోధకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఆవిష్కరణ ఇస్రో సాధించిన మరో మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు...

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది



అమరావతి, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): దక్షిణ కోస్తాంధ్రపై ప్రభావం చూపుతున్న 'మురసు' తీవ్ర తుపాను కారణంగా రానున్న మూడు గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది.

ప్రస్తుతం 'మురసు' తీవ్ర తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఇది బాపట్లకు 40 కి.మీ, ఒంగోలుకు 50 కి.మీ, విజయవాడకు 90 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, మన్యం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరుతో పాటు నెల్లూరు, కడప, నంద్యాల జిల్లాల్లోనూ అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ కీలక సూచనలు జారీ చేశారు. "భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దు. ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు.

అయితే, 'మురసు' తుపాను క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ రోజు రాత్రి నుంచి ఈదురుగాలుల తీవ్రత కూడా తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. అయినప్పటికీ, అధికార యంత్రాంగం నుంచి హెచ్చరికలు తొలగించే వం-కు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

వినుకొండ పురపాలక సంఘ ఎన్నికల ఫలితాల్లో కూటమిదే విజయం

- 36 వార్డుల విజేతల పూర్తి వివరాలు



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్): వినుకొండ పురపాలక సంఘ ఎన్నికల్లో మొత్తం 36 వార్డులకు సంబంధించి విజయం సాధించిన అభ్యర్థులు, వారి ఓట్ల మెజారిటీ వివరాలు ఇలా ఉన్నాయి.

1వ వార్డు – గంధం శకుంతల (టీడీపీ) – 275 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2వ వార్డు – పల్లమీసాల దాసయ్య (టీడీపీ) – 49 ఓట్ల మెజారిటీ, 3వ వార్డు – పఠాన్ నాగూర్ షరీఫ్ (టీడీపీ) – 216 ఓట్ల మెజారిటీ,4వ వార్డు – కొమిరిశెట్టి పద్మ (జనసేన) – 369 ఓట్ల మెజారిటీ, 5వ వార్డు – పోలూరి అంజన దేవి (టీడీపీ) – 584 ఓట్ల మెజారిటీ, 6వ వార్డు – గంధం కోటి (టీడీపీ) –111 ఓట్ల మెజారిటీ,7వ వార్డు – పత్తి వేదవతి (టీడీపీ) – 171 ఓట్ల మెజారిటీ,8వ వార్డు – పెనుగొండ శ్రీనివాసరావు (టీడీపీ) – 410 ఓట్ల మెజారిటీ, 9వ వార్డు – గట్టుపల్లి శ్రీనివాసరావు (టీడీపీ) – 482 ఓట్ల మెజారిటీ, 10వ వార్డు – బీర్నిడి సురేఖ (టీడీపీ) – 67 ఓట్ల మెజారిటీ, 11వ వార్డు – షేక్ మస్తాన్ బి (టీడీపీ) – 222 ఓట్ల మెజారిటీ, 12వ వార్డు – పులి కొండమ్మ (టీడీపీ) – 120 ఓట్ల మెజారిటీ, 13వ వార్డు – సంపెంగుల రమాదేవి (టీడీపీ) – 70 ఓట్ల మెజారిటీ, 14వ వార్డు – వద్దూరి కాసమ్మ (జనసేన) – 288 ఓట్ల మెజారిటీ, 15వ వార్డు – సాధినేని అరుణ (టీడీపీ) – 211 ఓట్ల మెజారిటీ, 16వ వార్డు – సుధా జయ నాగ గణేష్ (బీజేపీ) – 615 ఓట్ల మెజారిటీ, 17వ వార్డు – కోట స్రవంతి (బీజేపీ) – 278 ఓట్ల మెజారిటీ, 18వ వార్డు – మేదరపాలెం షేక్ మహబూబ్ బాషా (వైసీపీ) – 148 ఓట్ల మెజారిటీ, 19వ వార్డు – అమర శ్రీనివాసరావు (టీడీపీ) – 219 ఓట్ల మెజారిటీ, 20వ వార్డు – షేక్ షర్మిల (టీడీపీ) – 238 ఓట్ల మెజారిటీ, 21వ వార్డు – షేక్ ఖాసీం సైదా జానీ (టీడీపీ) – 277 ఓట్ల మెజారిటీ, 22వ వార్డు – షేక్ మస్తాన్ బి (వైసీపీ) – 43 ఓట్ల మెజారిటీ, 23వ వార్డు – పూజారి శ్రీనివాసరావు (జనసేన) – 26 ఓట్ల మెజారిటీ, 24వ వార్డు – గొడవర్తి సుజాత (బీజేపీ) –- 182 ఓట్ల మెజారిటీ, 25వ వార్డు – షేక్ బాదుల్ల (వైసీపీ) – 76 ఓట్ల మెజారిటీ, 26వ వార్డు – షేక్ శారీఫా బుదే (వైసీపీ) – 45 ఓట్ల మెజారిటీ, 27వ వార్డు – సంపెంగుల నరసయ్య (టీడీపీ) – 160 ఓట్ల మెజారిటీ, 28వ వార్డు – షేక్ శంషాద్ (వైసీపీ) – 162 ఓట్ల మెజారిటీ, 29వ వార్డు – అద్దంకి సల్మా సుల్తానా (వైసీపీ) – 115 ఓట్ల మెజారిటీ, 30వ వార్డు – జంపాకణాల షేక్ సుల్తానా (అబిబుబిల్లా) (వైసీపీ) – 238 ఓట్ల మెజారిటీ, 31వ వార్డు – గుమ్మడిదల అఖిల (సీపీఐ) – 35 ఓట్ల మెజారిటీ, 32వ వార్డు – షేక్ అత్తార్ నాగూర్ వలి (వైసీపీ) –130 ఓట్ల మెజారిటీ, 33వ వార్డు – దేశవత్ రాజేందర్ నాయక్ (టీడీపీ) – 408 ఓట్ల మెజారిటీ, 34వ వార్డు – షేక్ జానీ భాష (టీడీపీ) – 138 ఓట్ల మెజారిటీ, 35వ వార్డు – వాసిరెడ్డి లింగమూర్తి (టీడీపీ) – 221 ఓట్ల మెజారిటీ, 36వ వార్డు – వెంపటి అరుణ శ్రీ (టీడీపీ) – 477 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పార్టీల వారీగా టీడీపీ – 21 వార్డులు, వైసీపీ – 8 వార్డులు, బీజేపీ – 3 వార్డులు, జనసేన – 3 వార్డులు, సీపీఐ – 1 వార్డు గెలుపొందాయి.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

పీజీటీ, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులపై స్పష్టత ఇవ్వాలి

○ ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపుల సంప్రదాయాన్ని పునరుద్ధరించాలి: ఎన్‌టీఏ

విజయవాడ,నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): జీఓ ఎంఎస్ నెం.156లో ఉపాధ్యాయ పోస్టుల వివరాలు వెల్లడించినప్పటికీ, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లోని పీజీటీ, మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులపై స్పష్టత ఇవ్వలేదని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,86,273 పోస్టులు మంజూరై ఉండగా 1,61,369 మంది పనిచేస్తున్నారని, 24,904 పోస్టుల వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. 292 బాలికల, 210 కో-ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు మంజూరైన పీజీటీ పోస్టులు, వాటి క్యాడర్ స్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.
మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్/స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 9,656 పోస్టులు మంజూరై, 4,494 మంది పనిచేస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారని తెలిపారు. మిగిలిన 5,162 పోస్టుల్లో ఎన్ని పీఎస్ హెచ్‌ఎం, ఎన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పీజీటీ విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్ల క్యాడర్, పదోన్నతులు, ఖాళీల భర్తీపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు.
గత ఆరు నెలలుగా రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపులు జరగలేదని ఎన్‌టీఏ నాయకులు పేర్కొన్నారు. గతంలో కొనసాగిన సంప్రదింపుల సంప్రదాయాన్ని పునరుద్ధరించి, పీజీటీ, పీఎస్ హెచ్‌ఎం పోస్టుల మంజూరు, క్యాడర్ గుర్తింపు, ఖాళీల భర్తీ, పదోన్నతులపై అన్ని సంఘాలతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు

తుపాను ప్రభావంతో వివిఐటియు బాలోత్సవ్ 2026 వాయిదా

గుంటూరు, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): తుపాను అనంతర పరిస్థితులు, ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో నవంబర్ 5, 6, 7 తేదీల్లో నిర్వహించాల్సిన 'వివిఐటియు బాలోత్సవ్ 2026' వేడుకలను వాయిదా వేసినట్లు నిర్వాహక కమిటీ ప్రకటించింది.
తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం, రవాణా సౌకర్యాలకు అంతరాయం కలగడం, విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడటాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.
బాలోత్సవ్ నిర్వహించే నూతన తేదీలను త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని నిర్వాహక కమిటీ వెల్లడించింది. వాయిదా వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తూ, అందరూ సహకరించాలని కోరింది.

ఏసీబీ వలలో మెప్మా ఏడీ..



○ ఇంట్లో కిలోల కొద్దీ బంగారం, ఆస్తిపత్రాలు గుర్తింపు
○ మెప్మా అదనపు డైరెక్టర్ యాదగిరి రావుపై ఏసీబీ కేసు నమోదు

హైదరాబాద్, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): పురపాలక ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరి రావు అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో ఆయనపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, జరిపిన సోదాల్లో సుమారు రూ. 4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. మంగళవారం హైదరాబాద్‌తో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. యాదగిరి రావు నివాసం, కార్యాలయం, బంధువులు, బినామీలకు సంబంధించిన ఇళ్లలో ఈ సోదాలు జరిగాయి. ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఉప్పల్ హైకోర్టు కాలనీలో 334 గజాల స్థలంలో నిర్మించిన G+3 భవనం విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని అంచనా. దీంతో పాటు ఉప్పల్‌లోనే రెండు ఫ్లాట్లు, ఒక వాణిజ్య దుకాణం, హబ్సిగూడ, పెద్ద అంబర్‌పేట్, మేడిపల్లి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో మొత్తం 12 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు పత్రాలను గుర్తించారు.
సోదాల్లో సుమారు 1.8 కిలోల బంగారం (1,792 గ్రాములు), 3 కిలోల వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ. 73 లక్షల విలువైన టయోటా ఫార్చ్యూనర్, మరో కారు, మూడు ద్విచక్ర వాహనాలను గుర్తించారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 32.30 లక్షల నగదు నిల్వలు, రూ. 29 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ. 7 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఉన్నట్లు తేలింది.
ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ. 4.75 కోట్లుగా లెక్కగట్టామని, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ ఇంకా చాలా ఎక్కువగా ఉంటుందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. యాదగిరి రావు కుమారుడికి సంబంధం ఉన్నట్లు భావిస్తున్న రబ్బర్ ఫ్యాక్టరీ, ట్రాన్స్‌మిషన్ పరిశ్రమల్లోని పెట్టుబడులపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన అధికారులు, యాదగిరి రావును ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కేసులో విచారణ కొనసాగుతోంది.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్

అమరావతి, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు.
చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.
నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు.
ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ప్రజలు అందించిన అఖండ విజయాన్ని బాధ్యతగా స్వీకరించాలి

○ గుంటూరు నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి
○ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కూటమి కార్పొరేటర్లకు పెమ్మసాని అభినందనలు



గుంటూరు, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అఖండ విజయాన్ని అందించిన నగర ప్రజలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు కల్పించిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నగర అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని విజయం సాధించిన మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కూటమి కార్పొరేటర్లకు సూచించారు.
ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించిన మేయర్ అభ్యర్థి, కూటమి కార్పొరేటర్లకు పెమ్మసాని అభినందనలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కేవలం రాజకీయ విజయంగా కాకుండా గుంటూరు నగర అభివృద్ధి కోసం అప్పగించిన బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరిగేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.
ప్రజలు చూపిన ఆదరణ, విశ్వాసం ఎంతో విలువైనవని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పెమ్మసాని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి వార్డులోని స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని తెలిపారు.
కార్పొరేటర్లుగా ఎన్నికైన వారు తమ వార్డులకే పరిమితం కాకుండా మొత్తం గుంటూరు నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని పెమ్మసాని అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

కూటమి తరఫున విజయం సాధించిన కార్పొరేటర్లంతా పరస్పర సమన్వయం, ఐకమత్యంతో పనిచేయాలని పెమ్మసాని స్పష్టం చేశారు. వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ విభేదాలకు తావివ్వకుండా ప్రజా ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ నాయకత్వంలో కార్పొరేటర్లంతా సమష్టిగా పనిచేస్తూ ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.
గుంటూరు నగరాన్ని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పెమ్మసాని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని తెలిపారు.
ప్రజలు అందించిన అఖండ విజయాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి, వారి నమ్మకాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించాలని పెమ్మసాని పిలుపునిచ్చారు. గుంటూరు నగర ప్రగతి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి కార్పొరేటర్లంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

క్యూఎస్ వరల్డ్ ఆసియా ర్యాంకింగ్స్‌లో ఎస్‌ఆర్‌ఎంకి అగ్రస్థానం

○ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో నంబర్ వన్
○ దక్షిణాసియాలో టాప్ 100లో 98 వ స్థానం
○ ఆసియాలో 407 వ ర్యాంక్



అమరావతి, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): అంతర్జాతీయ విద్యా ప్రమాణాల్లో మరో కీలక మైలురాయిని అధిగమిస్తూ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ-ఏపీ విశిష్ట గుర్తింపును సాధించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ఆసియా ర్యాంకింగ్స్ - 2027లో సత్తా చాటింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఓవరాల్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు దక్షిణాసియాలోని టాప్ 100 విశ్వవిద్యాలయాల్లో 98వ స్థానాన్ని కైవసం చేసుకోవడంతోపాటు ఆసియాలోనే 407 ర్యాంకును సొంతం చేసుకుంది. ఈ గుర్తింపు అంతర్జాతీయ విద్యా రంగంలో విశ్వవిద్యాలయం సాధిస్తున్న ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోంది.
ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు అత్యంత ప్రాధాన్యతనిచ్చే ర్యాంకింగ్స్‌లో క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ఒకటి. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న క్యూ ఎస్ సంస్థ ఏటా ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాల ఆధారంగా వివిధ దేశాలు, ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాల విద్యా ప్రమాణాలు, పరిశోధనలు, బోధన, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు తదితర అంశాలను సమగ్రంగా విశ్లేషించి ర్యాంకులను ప్రకటిస్తుంది.
కేవలం తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభమైన ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ-ఏపీ అతి తక్కువ సమయంలోనే అంతర్జాతీయ విద్యా రంగంలో గుర్తింపు పొందడం విశేషం. నాణ్యమైన విద్య, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాల కల్పన, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సుస్థిర అభివృద్ధి వంటి కీలక రంగాల్లో విశ్వవిద్యాలయం వేగంగా ముందుకు సాగుతోంది. పరిశోధనా వ్యవస్థలను విస్తరిస్తూ, అంతర విభాగ విద్యా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన అభ్యసన అవకాశాలను విద్యార్థులకు కల్పిస్తోంది.
అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలను బలోపేతం చేయడంతో పాటు పరిశోధన ఆధారిత విద్య, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం చేసేలా బోధన, పరిశోధన, ఆవిష్కరణలను సమన్వయం చేస్తోంది.
ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ పి. సత్యనారాయణన్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం చేస్తున్న నిరంతర కృషికి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో లభించిన గుర్తింపు నిదర్శనమని అన్నారు.
విశ్వవిద్యాలయాలు కేవలం విజ్ఞానాన్ని అందించడమే కాకుండా, నూతన జ్ఞానాన్ని సృష్టించి, దానిని ఆవిష్కరణలుగా మలిచి సమాజానికి అర్థవంతమైన సేవలు అందించాలన్న లక్ష్యంతో తమ ప్రయాణం కొనసాగుతోందని పేర్కొన్నారు.
విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, పరిశోధకులు సమిష్టిగా చేస్తున్న నిరంతర కృషికి ఈ అంతర్జాతీయ ర్యాంకింగ్స్ గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో మరింత నాణ్యతను పెంపొందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తామని వెల్లడించారు.

హైదరాబాద్‌లో భారీ ఫేక్ కరెన్సీ రాకెట్..

○ రూ.6.78 కోట్ల నకిలీ నోట్ల పట్టివేత
○ హైదరాబాద్ శివార్లలో భారీ నకిలీ కరెన్సీ ముఠా అరెస్ట్
○ యూట్యూబ్ చూసి నకిలీ నోట్ల తయారీ నేర్చుకున్న నిందితులు
○ నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు, మరో ముగ్గురి కోసం గాలింపు



హైదరాబాద్, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): నగర శివార్లలో నకిలీ కరెన్సీ ముద్రించి, చలామణీ చేయడంతో పాటు దోపిడీలకు పాల్పడుతున్న ఓ భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఏకంగా రూ. 6.78 కోట్ల విలువైన నకిలీ రూ. 500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రింటర్లు, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని కూడా సీజ్ చేసినట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు.
వివరాల్లోకి వెళితే, నవంబర్ 1వ తేదీన జాతీయ రహదారి-65పై రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో ఒక కారులో నకిలీ నోట్లను విజయవాడకు తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ సంయుక్తంగా వాహనాన్ని అడ్డగించి తనిఖీ చేశారు. కారులో ఉన్న ఎం. కరుణాకర్, సిహెచ్. మాణిక్య రెడ్డి, సిహెచ్. రత్నాకర్ రెడ్డి, కె. అజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 8 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.
నిందితులను విచారించగా, కుంట్లూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నకిలీ కరెన్సీ ప్రింటింగ్ యూనిట్‌ను నడుపుతున్నట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు వెంటనే ఆ ఇంటిపై దాడి చేసి, భారీ మొత్తంలో నకిలీ నోట్ల కట్టలు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్, కరెన్సీ కటింగ్ మెషీన్‌లను సీజ్ చేశారు.
నిందితుల మోసం ఇలా.. ఈ ముఠా కేవలం నకిలీ నోట్లను ముద్రించడమే కాకుండా, వినూత్న పద్ధతిలో దోపిడీలకు పాల్పడేదని పోలీసులు తెలిపారు. తక్కువ ధరకు నకిలీ కరెన్సీ ఇస్తామని, అసలు డబ్బు ఇస్తే మూడు, నాలుగు రెట్లు నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపి కస్టమర్లను ఆకర్షించేవారు. వారు అసలు డబ్బుతో వచ్చినప్పుడు, ముఠాలోని ఇతర సభ్యులు నకిలీ పోలీస్ ఐడీ కార్డులు, వాకీ-టాకీలు, డమ్మీ పిస్టల్‌తో పోలీసుల వేషంలో అక్కడికి వచ్చేవారు. నకిలీ నోట్ల దందా చేస్తున్నారంటూ కస్టమర్లను బెదిరించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించేవారు. దీంతో భయపడిన బాధితులు తమ వెంట తెచ్చుకున్న అసలు డబ్బును అక్కడే వదిలి పారిపోయేవారు. ఈ విధంగా ఇద్దరు కస్టమర్ల నుంచి రూ. 2 లక్షలు, రూ. 3 లక్షలు దోచుకున్నట్లు విచారణలో తేలింది.
ప్రధాన నిందితుడు కరుణాకర్, యూట్యూబ్ వీడియోలు చూసి అసలు రూ. 500 నోటును స్కాన్ చేసి, ఫోటోషాప్‌లో ఎడిట్ చేసి నకిలీ నోట్లను ఎలా ప్రింట్ చేయాలో నేర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్ట్ చేసిన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా, వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఈ కేసులో పరారీలో ఉన్న జెల్లి వెంకటేష్, కుంజ బాలరాజు, కంపసాటి శ్రీనివాస్ అనే మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ రాకెట్ వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మురుసు తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రం పరిశీలన



○ బాధితులకు భోజనం వడ్డించి, మందులు పంపిణీ చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్):వినుకొండ పట్టణంలోని నిర్మల స్కూల్ నందు ఏర్పాటు చేసిన మురుసు తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పరిశీలించారు. బాధితులకు స్వయంగా భోజనం వడ్డించి, అంటువ్యాధులు మరియు జ్వరాలు రాకుండా అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఈ పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
అనంతరం అధికారులను అప్రమత్తం చేస్తూ.. లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, లైన్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితికైనా రెస్క్యూ బృందాలు, కంట్రోల్ రూమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చారిత్రక విజయం : పల్లా శ్రీనివాసరావు

○ రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో కూటమికి 95 శాతం స్థానాలు
○ జగన్ విధ్వంస పాలనను ప్రజలు ఇంకా మర్చిపోలేదనడానికి ఇదే నిదర్శనం
○ సూపర్ సిక్స్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే గెలుపునకు కారణం



అమరావతి, నవంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని పురపాలక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చారిత్రక విజయం దిశగా దూసుకుపోతోంది. దాదాపు 95 శాతం స్థానాలను కైవసం చేసుకుని, ప్రభుత్వంపై ప్రజలకున్న అచంచల విశ్వాసాన్ని మరోసారి నిరూపించుకుంది. ఈ అపూర్వ విజయంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు తమ ఓటు ద్వారా సంపూర్ణ ఆమోదముద్ర వేశారని ఆయన పేర్కొన్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విజయం కూటమి కార్యకర్తల అహర్నిశల శ్రమకు, ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి దక్కిన గుర్తింపు అని అన్నారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిబద్ధత, యువనేత నారా లోకేశ్ దార్శనికతతో పాటు రాష్ట్ర బీజేపీ నాయకత్వంపై ప్రజలకున్న తిరుగులేని విశ్వాసానికి ఈ ఫలితాలే ప్రత్యక్ష తార్కాణమని పల్లా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య ఉన్న పటిష్టమైన ఐక్యతకు, రాష్ట్ర ప్రగతికి కేంద్రం అందిస్తున్న సహకారానికి ప్రజలు జై కొట్టారన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీల జెండాలను భుజాన మోసి, గెలుపు కోసం అలుపెరగకుండా పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో గెలుపొందిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

జగన్ విధ్వంస పాలనను ప్రజలు ఇంకా మర్చిపోలేదు

జగన్ సాగించిన ఐదేళ్ల విధ్వంస పాలనను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన తీర్పునే పురపాలక ఎన్నికల్లోనూ ప్రజలు పునరావృతం చేశారని, వైసీపీ పాలన పట్ల ప్రజల్లో ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. ఇప్పటికైనా ఆ 'గొడ్డలి పార్టీ' తమ తప్పుడు, విష ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ఏకంగా 62 పిటిషన్లను కోర్టుల్లో దాఖలు చేసి అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు.
"ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ, ఎక్కడో ఏదో జరిగిపోయిందంటూ ఫేక్ ప్రచారాలతో ప్రజలను భయపెట్టాలని చూశారు. కానీ, ప్రజలు చాలా విజ్ఞులు. ఎవరు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారో, ఎవరు మోసం చేస్తున్నారో వారికి పూర్తి స్పష్టత ఉంది. అందుకే వైసీపీని మరోసారి చిత్తుచిత్తుగా ఓడించారు" అని పల్లా పేర్కొన్నారు.

బ్యాలెట్ అయినా.. ఈవీఎం అయినా.. తీర్పు ఒక్కటే

ఈ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరిగినా కూటమి పార్టీలకే ప్రజలు పట్టం కట్టారని, దీన్నిబట్టి ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా ప్రజల నమ్మకం కూటమిపైనే ఉందని నిరూపితమైందని పల్లా తెలిపారు. పులివెందుల, పుంగనూరు వంటి ప్రాంతాల్లో వైసీపీ సృష్టించిన ఘర్షణలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని వివరించారు. ఈ అద్భుత విజయం క్షేత్రస్థాయిలో శ్రమించిన కూటమి కార్యకర్తల కష్టానికి దక్కిన ఫలితమని, పార్టీల జెండాలు మోసి పోరాడిన ప్రతి కార్యకర్తకు సెల్యూట్ చేస్తున్నానని అన్నారు.

సంక్షేమం, అభివృద్ధే విజయానికి బాటలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'సూపర్ సిక్స్' హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తుండటమే ఈ విజయానికి ప్రధాన కారణమని పల్లా శ్రీనివాసరావు విశ్లేషించారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందించే 'దీపం 2.0' వంటి పథకాలు ప్రజల్లో ప్రభుత్వానికి కొండంత నమ్మకాన్ని పెంచాయన్నారు.
ఒకవైపు సంక్షేమం, మరోవైపు అమరావతి, పోలవరం పనులను వేగవంతం చేయడం, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయడం వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశంలోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికే రావడం కూటమి నాయకత్వంపై పారిశ్రామికవేత్తలకున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఈ గెలుపుతో తమపై బాధ్యత మరింత పెరిగిందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని, 2029లో మళ్లీ సగర్వంగా ప్రజల ముందుకు వస్తామని పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P). Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com